అందరి బడ్జెట్

అభివృద్ధి.. సంక్షేమానికి ప్రాధాన్యం





బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు వస్తున్న పయ్యావుల కేశవ్‌తో మంత్రులు

- వ్యవసాయం, ఉద్యానానికి ఊతం
- సాగునీటి ప్రాజెక్టులకూ నిధులు
- 1,75,844 మందికి తల్లికి వందనం
- 2.83 లక్షల మంది అన్నదాతలకు సుఖీభవ
- పెనుకొండలో ఈఎస్ఐ ఆస్పత్రికి స్థలం

బడ్జెట్ సూపర్ 6లో..

పుట్టపర్తి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌లో జిల్లాకు సముచిత ప్రాధాన్యం దక్కింది. అన్ని వర్గాలకు మేలు చేసేలా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ 2025-26 బడ్జెట్‌ను రూపొందించారు. అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం లభించిందని జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు భారీగా నిధులను కేటాయించారు. జిల్లాలో వ్యవసాయం, సహకార, మార్కెటింగ్, ఉద్యాన, పశు సంపద, పట్టు, మత్స్య, కోళ్ల పరిశ్రమలతో ఉపాధి పొందుతున్నవారి ఆదాయం పెంచేలా బడ్జెట్ ఉందన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది.

వ్యవసాయం.. అనుబంధం..

అన్నదాత సుఖీభవ పథకం ద్వారా జిల్లాలోని 2.83 లక్షల మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.20 వేలు అందనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 5.98 లక్షల హెక్టార్లకు సరిపడా సూక్ష్మపోషకాలను రాయితీపై ఇవ్వనున్నారు. ఉత్తమ బైవోల్టీన్ పట్టు ఉత్పత్తిలో హిందూపురంలో లీఫ్ టు క్లాత్ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. వీటితోపాటు బడ్జెట్‌లో వ్యవసాయ యాంత్రీకరణకు రూ.219.65 కోట్లు, సూక్ష్మసేద్యం అమలు కోసం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద 3.75 లక్షల ఎకరాలకు రూ.500 కోట్లు, రైతులకు వడ్డీలేని రుణం కింద కేటాయించిన రూ.250 కోట్లు జిల్లా రైతాంగానికి ఎంతగానో ఉపయోగపడతాయి. ఉచిత విద్యుత్, ఎన్టీఆర్ జల సిరి వంటివి రైతాంగానికి ఊరటనిచ్చే పథకాలు.

పరిశ్రమలకు ప్రోత్సాహం

- బడ్జెట్‌లో పరిశ్రమలు, వాణిజ్య శాఖకు రూ.3,156 కోట్లు కేటాయించారు. జిల్లాలో కొత్తగా పారిశ్రామిక కారిడార్ కింద చిలమత్తూరును ఎంపిక చేశారు. ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్త ఉండాలనే లక్ష్యంతో పారిశ్రామిక వాడలను అభివృద్ధి చేస్తున్నారు. నైపుణ్యాభివృద్ధికి రూ.1,228 కోట్లు కేటాయించారు. జిల్లాలో శ్రామిక శక్తి నైపుణ్యాలను పెంచేందుకు తగినన్ని నిధులు వచ్చే అవకాశం ఉంది.
- హంద్రీనీవా సుజల స్రవంతి పథకం రెండో దశ కాలువ వెడల్పు, లైనింగ్ పనుల గురించి బడ్జెట్‌లో ప్రస్తావించారు. జలవనరుల శాఖకు రూ.18,019 కోట్లు కేటాయించారు. దీంతో జిల్లాలో మధ్య, చిన్న తరహా ప్రాజెక్టులకు భారీగా నిధులు వస్తాయని భావిస్తున్నారు.

వైద్యం, సంక్షేమం

- పెనుకొండలో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం జరగనుంది. దీనికోసం భూమిని గుర్తించారు. కార్మిక కుటుంబాలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాల భద్రత కోసం కుటుంబ యజమానికి చంద్రన్న బీమా పథకం అమలు చేపసేందుకు విధివిధానాలను నిర్ణయించేందుకు వర్కింగ్ కమిటీ ఏర్పాటు చేశారు.
- బీపీఎల్ ఎస్టీ, ఎస్సీ కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్ అందిస్తారు. చేనేత మగ్గాలు, నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు ఉచిత విద్యుత్ అందిస్తారు. ఆదరణ పథకానికి భారీగా నిధులు కేటాయించినందున.. చేతి వృత్తుల వారికి పరికరాలు అందనున్నాయి.

చదువుకు భరోసా

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి(ఇంటర్) వరకు చదివే పిల్లలకు తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సాయం అందనుంది. పాఠశాల్లో మౌలిక సదుపాయల కల్పనకు నిధులు కేటాయించారు. జిల్లాలోని 1,75,844 మంది విద్యార్థులకు మేలు జరుగుతుంది.

సంక్షేమానికి అత్యుత్తమ బడ్జెట్



అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా భావించి రూపొందించిన ఈ బడ్జెట్ సామాన్యుల సంక్షేమానికి అత్యుత్తమ బడ్జెట్. పేదప్రజల అభివృద్ధి, వ్యవసాయరంగానికి, సూపర్‌సిక్స్ పథకాల అమలుకు నిధులు ఎక్కువగా కేటాయించడం ముదావహం. సాగునీటి రంగానికి 11,314కోట్లు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధులు, నైపుణ్య శిక్షణకు, జలజీవన్ మిషన్‌కు, రోడ్ల మరమ్మతులు, రాజధాని నిర్మాణానికి రాష్ట్ర బడ్జెట్‌లో కనీవినీ ఎరుగని రీతిలో నిధులు కేటాయించడం ఆనందదాయకం. దీంతో ప్రగతిలో ఏపీ పరుగులు పెట్టే అవకాశం ఉంది.

- పల్లె సింధూరారెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే

లెక్కలు ఫుల్... ఖజానా నిల్



బడ్జెట్‌లో రాయల సీమకు అన్యాయం చేశారు. లెక్కలు ఫుల్ ఖజానా నిల్ అన్నట్లుగా బడ్జెట్ ఉంది. సాగునీటి ప్రాజెక్టులకు అరకొర కేటాయింపులతో సరిపెట్టారు. కౌలు రైతును విస్మరించారు. ఎన్నికల్లో కూటమి పార్టీలు మహిళలకు ఉచిత బస్సు, ప్రతినెలా రూ. 1500, నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీపై బడ్జెట్‌లో స్పష్టత ఇవ్వలేదు. ఏపీ చరిత్రలోనే రికార్డు స్థాయి అప్పులకు రంగం సిద్ధమైందని ఈ బడ్జెట్ స్పష్టంగా చెబుతోంది.

- వేమయ్యాయాదవ్, సీపీఐ జిల్లా కార్యదర్శి

బీసీల బడ్జెట్



ఎన్నికల హామీలు నెరవేర్చేలా బడ్జెట్ ఉంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.47456 కోట్లు కేటాయించడం హర్షనీయం. సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం భారీ ఎత్తున నిధులు కేటాయించాం. వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు కేటాయింపులతో రాష్ట్రం బలమైన ఆర్థిక వ్యవస్థగా రూపొందనుంది. వెయ్యి కోట్లతో ఆదరణ పథకం పునరుద్ధరణ. కాపులకు రూ.4890 కోట్లు, బీసీలతోపాటు ఆర్థికంగా వెనుకబడిన కులాలకు రూ.10619 కోట్లు, నేతన్నలు, నాయీ బ్రాహ్మణుల, మత్స్యకారులకు ఉచిత విద్యుత్‌తో కులవృత్తులకు మంచిరోజులొస్తాయి.

-సవిత, బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి

మురుగుతున్న నిధులు..!

- కదిరి మున్సిపాలిటీలో నిర్లక్ష్యం
- కాలువల్లో పూడిక తొలగింపునకు రూ.60 లక్షలు విడుదల
- రూ.8 లక్షల పనులు పూర్తి
- అర్ధంతరంగా ఆపేసిన వైనం
- అధికారుల వైఖరిపై విమర్శలు





చెత్తతో నిండిపోయిన ఎన్‌జీవో కాలనీలోని మురుగు కాలువ

కదిరి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నిధులు సిద్ధంగా ఉన్నా.. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో కాలువల్లో పూడికతీత పనులు ఆగిపోయాయి. పనులకు టెండర్లు పిలవకుండా.. నామినేషన్ ప్రాతిపదికన చేపట్టడంతో పనులు ముందుకు కదలడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ పాలనలో నిధులివ్వక పారిశుధ్య పనులు అటకెక్కాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే నిధులిచ్చినా.. అధికారుల వైఖరితో కాలువల్లో మురుగు ముందుకు కదలట్లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. పూడికతీత పనులకు దాదాపు రూ.60 లక్షలు విడుదలయ్యాయి. అధికారులు హడావుడిగా పనులు మొదలుపెట్టారు. ముఖ్యంగా ఎన్టీఆర్ సర్కిల్, వలీసాబ్ రోడ్, నానాదార్గా వద్ద కాలువల్లో పూడిక తీయించారు. దీంతో స్థానికులు కూడా చాలా ఏళ్ల తరువాత పూడికతీత పనులు చేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. అంతలోనే పనులు ఆపేశారు. దీంతో మళ్లీ ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయింది. రూ.8 లక్షల పనులు మాత్రమే చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మిగిలిన నిధులు అలాగే మూలుగుతున్నాయి.

ఎక్కడి మురుగు అక్కడే...

పూడికతీత పనులు ఆపేయడంతో మురుగు కాలువలు నిండిపోయాయి. కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. కందికుంట నారాయణమ్మ కాలనీ నుంచి అడపాల వీధి మీదుగా ఎన్‌జీవో కాలనీ వరకు ఉన్న ప్రధాన మురుగునీటి కాలువ పూడికతో నిండిపోయింది. దానిపైన ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లతో నిండిపోయి ఉంది. ఈ కాలువలో పూడిక తీయాల్సి ఉంది. వలీసాబ్ రోడ్డు నుంచి వచ్చే మురుగు కాలువ నల్లగుట్ట వీధి వద్ద పూర్తిగా పూడికతో నిండిపోయి ఉంది. ఈ కాలువలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. వీటిల్లో పూడిక తీయకపోవడంతో ఇతర చిన్న కాలువల్లో సైతం మురుగు ముందుకు కదలడం లేదు. వాటిల్లో కూడా పూడిక తీయాల్సి ఉందని ప్రజలు చెబుతున్నారు.

కాలువలు పొంగే ప్రమాదం

వర్షాకాలం నాటికి కాలువల్లో పూడిక తీయకపోతే పట్టణంలోని అనేక కాలువలు పొంగే ప్రమాదం ఉంది. గతంలో కూడా ఇటుకరాతి చెరువు నుంచి వచ్చే కాలువ పొంగి నానాదర్గా సమీపంలో అనేక ఇళ్లలోకి నీరు చేరింది. 2021లో వచ్చిన వరదలకు అయ్యప్పస్వామి గుడి వెనుక వైపు ప్రాంతం జలమయమైంది. ప్రధాన మురుగునీటి కాలువల్లో పూడిక తీయకపోతే అవి ఉప్పొంగే ప్రమాదం ఉంది. ఈ మురుగునీటి కాలువలపై అనేక మంది మెట్లు నిర్మించి దర్జాగా కబ్జా చేసి, ఇళ్లు కట్టుకున్నారు. వీటిని కూడా తొలగించాల్సి ఉంది. ఉన్న నిధులు సద్వినియోగం చేసుకుని, అన్ని కాలువల్లో వర్షాకాలం నాటికి పూడిక తీస్తే ప్రమాదం తప్పుతుంది. దోమల బెడద కూడా ఉండదు. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

టెండర్లు పిలవకపోవడమే కారణమా?

నిధులు సిద్ధంగా ఉన్నా.. పనులు ఆగిపోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. వాస్తవానికి టెండర్లు పిలిచి ఉండుంటే ఈ దుస్థితి దాపురించేది కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులను పూర్తి చేసేవారు. అధికారులు నామినేషన్ ప్రాతిపదికన పనులు చేయాలని భావించారు. పలువురితో పనులు చేయించారు. ఆ తర్వాత ఎవరూ ముందుకురాలేదు. దీంతో పనులు ఆగిపోయాయని తెలుస్తోంది.

ప్రధాన కాలువల్లో పూడిక తొలగిస్తాం

పట్టణంలోని ప్రధాన కాలువల్లో పూడికలు తొలగిస్తాం. అందుకు మదింపు అంచనాలు సిద్ధం చేస్తున్నాం. ఉన్న నిధులను సద్వినియోగం చేసుకుని, అన్ని కాలువలను శుభ్రం చేస్తాం.

-విజయకుమార్, మున్సిపల్ డీఈఈ, కదిరి

నిఘా నీడలో...

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు... ప్రతిగదిలో సీసీ కెమెరాల ఏర్పాటు



పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా



పరీక్షలకు సిద్ధం చేసిన డెస్కులు

హిందూపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఒక్కో పరీక్ష కేంద్రంలో, గేటు బయట, ప్రతిగదిలో సగటున రెండు అంతకు మించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటిద్వారా అనుక్షణం జిల్లా కేంద్రంలో, రాష్ట్ర కార్యాలయంలో పర్యవేక్షణ చేసే యంత్రాంగం ఉంటుంది. ప్రతి ప్రశ్నపత్రానికి బార్‌కోడ్, క్యూఆర్ స్కానర్ ఉంటుంది. పొరపాటున ప్రశ్నపత్రం బయటికి పోతే ఏ జిల్లాలో ఏ ఊరిలో ఏ కేంద్రంలో ఏ విద్యార్థి బయటకి ఇచ్చారన్నది సాంకేతిక పరిజ్ఞానంతో తెలుసుకోవచ్చు. పటిష్టమైన కస్టోడియన్ కేంద్రాలు, అక్కడి నుంచి ప్రశ్నపత్రం తరలించేవరకు ప్రత్యేక రూట్ మ్యాప్‌లో నిత్యం పరీక్షలు పర్యవేక్షించేందుకు సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఇలా కట్టు దిట్టమైన భద్రత, నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను దృష్టిలో పెట్టుకుని పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు.

నేటి నుంచే..

ఇంటర్ పరీక్షలు శనివారం నుంచి కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహించే విధంగా ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే జిల్లాకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్‌ను నియమించారు. పరీక్షల ప్రత్యేక అధికారి ఉంటారు. ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల నిర్వహణ ప్రణాళిక సిద్ధం చేశారు. పరీక్ష నిర్వహణలో కీలకభూమిక పోషించే చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్‌లు) డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌లు సమీక్ష నిర్వహించారు. ప్రశాంత వాతావరణలో విద్యార్థులు పరీక్షలు రాసేలా గదులు సిద్ధం చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 11,530మంది విద్యార్థులుండగా ఒకేషనల్ 1720విద్యార్థులు, రెండో సంవత్సరం విద్యార్థులు 9688మంది, ఒకేషనల్ 1187మంది పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో మొత్తం 42పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో ప్రభుత్వ కళాశాలలు 25సెంటర్లు ప్రైవేట్ కళాశాలలు 17సెంటర్లు ఏర్పాటు చేశారు. ఉదయం 9నుంచి 12గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. అయితే పరీక్ష కేంద్రానికి 8.30లోపే విద్యార్థులు చేరుకోవాలన్నారు. ఒక్కనిమిషం ఆలస్యమైనా అనుమతించరు. సెల్‌ఫోన్, ఇతర సాంకేతిక పరికరాలు అనుమతించరు. పరీక్ష కేంద్రాలవద్ద 144సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల వద్ద జెరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు.

పటిష్ట బందోబస్తు: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వీరత్న శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 42 కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు ఈ నెల 20 వరకూ నిర్వహిస్తామన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అనుమతి లేదని, పరీక్షా కేంద్రాల సమీపంలో జెరాక్స్ సెంటర్లు, సెల్‌ఫోన్ షాపులు మూసివేయాలని సూచించారు.

అప్పు కట్టలేకపోతే సచ్చిపో..!

రుణదాత తీవ్ర దూషణ... వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆదెప్పను 108లో తరలిస్తున్న దృశ్యం

కదిరి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అప్పు కట్టలేకపోతే సచ్చిపో అని రుణదాత వేధించడంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో జరిగింది. పట్టణం సీఐ నారాయణరెడ్డి తెలిపిన మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్లకు చెందిన ఆదెప్ప ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన హరిప్రసాద్ వద్ద పదేళ్ల కిందట రూ. 50వేలు అప్పుగా తీసుకున్నాడు. అప్పటి నుంచి వడ్డీ చెల్లిస్తు వచ్చాడు. అయినా అసలు, వడ్డీ కలిపి రూ. 1,14,000 అయ్యింది. ఆ డబ్బు ఇవ్వాలని ఆదెప్ప ఇంటి వద్దకు గత మూడు వారాల నుంచి హరిప్రసాద్ తిరుగుతున్నాడు. ఈక్రమంలో శుక్రవారం ఇటుకల బట్టీవద్దకు ఆదెప్ప, ఆయన భార్య శశికళ కూలి పనులకు వెళ్లారు. అక్కడకు వెళ్లిన హరిప్రసాద్ అప్పు విషయంగా ఆదెప్పపై దాడి చేశాడు. అడ్డు వచ్చిన ఆదెప్ప భార్యను కొట్టాడు. ఈ విషయమై వారు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి కదిరికి వచ్చారు. హరిప్రసాద్ కూడా కదిరికి వచ్చాడు. అక్కడే వేమారెడ్డి సర్కిల్‌లో ఓ హోటల్‌లో పని చేసుకుంటున్న ఆదెప్ప అత్త లక్ష్మీదేవిని కూడా దూర్భాషలాడాడు. దీంతో ఆమె కూడా ఆదెప్పతో కలిసి పోలీస్ స్టేషన్ వచ్చింది. రెండు వర్గాల వాదనలు విన్న పోలీసులు, ఫిర్యాదు ఇవ్వాలని అడిగారు. స్టేషన్ నుంచి బయటకు వచ్చిన ఆదెప్పను అప్పు కట్టలేకపోతే చచ్చిపో అని హరిప్రసాద్ తిట్టాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆదెప్ప తన వెంట తెచ్చుకున్న కురులకు వాడే ద్రావకం తాగాడు. గమనించిన పోలీసులు వెంటనే ఆదెప్పను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు సీఐ తెలిపారు. ఆదెప్ప, ఆయన భార్య ఫిర్యాదు మేరకు హరిప్రసాద్‌తో పాటు మరి కొంతమందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సారా రహితంగా మార్చుదాం

నవోదయం 2.0 ధ్యేయం అదే: కలెక్టర్



నవోదయం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, ఎక్సైజ్ అధికారులు

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నాటు సారా రహిత జిల్లాగా మార్చడమే నవోదయం 2.0 ధ్యేయమని, అధికారులు ఆ దిశగా పనిచేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కోర్టుహాల్‌లో జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ అధ్వర్యంలో నాటుసారా నిర్మూలన కార్యక్రమం నవోదయం 2.0పై సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను నాటుసారా రహిత రాష్ట్రంగా మార్చడమే ధ్యేయంగా ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. నవోదయం 2.0 డివిజన్, గ్రామస్థాయి సమావేశాలను వచ్చేనెలరోజులు నిర్వహించాలన్నారు. నాటుసార తయారీ దారులకు 8 సంవత్సరాలు జైలుశిక్ష, రూ. 5లక్షల వరకు జరిమానా శిక్షగా ఉంటుందనే విషయం తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంటు కమిషనర్ మునిస్వామి, జిల్లా ఎక్సైజ్ అధికారులు గోవిందనాయక్, నరసింహులు, ఆర్డీఓలు సువర్ణ, శర్మ, ఆనంద్, మహేష్, డీపీఓ సమత, సాంఘిక సంక్షేమ అధికారి శివరంగప్రసాద్, డీఎస్పీ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోండి

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, వేసవిలో తాగు నీటి సమస్యలేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్.. కలెక్టర్ టీఎస్ చేతన్‌కు సూచించారు. వేసవిలో నీటిద్వారా సంభవించే వ్యాధులు, ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన సమీక్ష చేశారు. సమీక్షలో జిల్లా కేంద్రం నుంచి కలెక్టర్‌తోపాటు డీఆర్ఓ విజయసారథి, ఆర్డీఓలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



బడ్జెట్ ప్రతులతో మంత్రి కేశవ్.. సహచర మంత్రుల చిరునవ్వులు

ప్రాజెక్టులకు జీవం..

బడ్జెట్‌లో రాయలసీమ ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతో ఆగిపోయిన పనులన్నీ పునఃప్రారంభమవుతాయి. ముఖ్యంగా హంద్రీనీవా వెడల్పుతో పాటు జీడిపల్లి, పేరూరు, భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుల పనులకు సంబంధించి భూసేకరణకు నిధులు మంజూరు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు జిల్లాపై ఉన్న ప్రత్యేక ప్రేమ దీనిద్వారా నిరూపితమైంది. ఆరేళ్లుగా ఆగిపోయిన జీడిపల్లి- పేరూరు, జీడిపల్లి- భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణాజలాల మళ్లింపు పనులు మళ్లీ పట్టాలెక్కనున్నాయి. - కాలవశ్రీనివాసులు, ప్రభుత్వ విప్

రాష్ట్రాన్ని పునర్నిర్మించేలా...

వైసీపీ పాలనలో ఆర్థిక విధ్వంసంతో కుదేలైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేలా బడ్జెట్‌లో నిధుల కేటాయింపులున్నాయి. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించడం హర్షనీయం. పట్టణాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చేలా నిధులు కేటాయించినందుకు అభినందనలు. సూపర్ సిక్స్ పథకాల అమలు దిశగా బడ్జెట్‌లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు నిధులు కేటాయించి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకుంది. వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసి అన్నదాతకు అండగా ప్రభుత్వం నిలిచింది.

- దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే

హామీలను నేరవేర్చేలా..

రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇచ్చిన వాగ్దానాలను నేరవేర్చేలా ఉంది. అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడపడానికి ముఖ్యమంత్రి చేస్తున్న కృషికి ఈ బడ్జెట్ నిదర్శనం. ఒకవైపు గత ప్రభుత్వాలు చేసిన అప్పులు కడుతూనే ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నేరవేర్చడానికి బడ్జెట్ రూపకల్పన చేశారు. తల్లికి వందనం ప్రతి విద్యార్థికి ఇవ్వడానికి రూ.9000 కోట్లు కేటాయించారు.

- కందికుంట వెంకటప్రసాద్, కదిరి ఎమ్మెల్యే

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా..

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో లో ప్రవేశపెట్టిన బడ్జెట్ అద్భుతంగా ఉంది. అన్ని వర్గాలకు ప్రాధాన్యం కల్పిస్తూ రాష్ట్ర పురోగతికి బాటలు వేస్తూ బడ్జెట్‌ను గొప్పగా రూపొందించారు. ఇరిగేషన్‌తోపాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలకు ఊతం ఇచ్చే లా బడ్జెట్ ఉంది. అధ్వానంగా ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధివైపు నడిపే సత్తా ఒక్క చంద్రబాబుకే ఉంది.

- ఎంఎస్ రాజు, ఎమ్మెల్యే, మడకశిర

ప్రజల ఆకాంక్షల బడ్జెట్

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు అందేలా బడ్జెట్ రూపకల్పన చేసినట్లుగా ఉంది. సూపర్ సిక్స్ పథకాల అమలు హామీలో భాగంగా అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు నిధులు కేటాయించి ఇచ్చిన మాటను చంద్రబాబు నిలుపుకున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, రైతుల, మహిళల కొనుగోలు శక్తి పెరిగేలా, ప్రాంతీయ అసమానతలు అధిగమించేలా, అభివృద్ధి వికేంద్రీకరణకు బడ్జెట్‌లో అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ప్రజలపై కొత్త పన్నుల భారం మోపకుండా చేశారు.

- వెంకటశివుడు యాదవ్, టీడీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు

అన్ని వర్గాలకు మేలు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు అమోదయోగ్యమైంది. బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలకు లబ్ధిని చేకూర్చే విధంగా బడ్జెట్‌ను రూపకల్పన చేశారు. బీసీ సంక్షేమానికి రూ. 47,456 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ. 20,281 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.8,159 కోట్లు, మైనార్టీల సంక్షేమానికి రూ. 5,434 కోట్లు కేటాయించి ఆయా వర్గాల్లో భరోసా నింపింది. ఐదేళ్లగా కులవృత్తులపై ఆధారపడి జీవించే వారికి అండగా ఆదరణ పథకాన్ని పునఃప్రారంభిస్తూ రూ. 1000 కోట్లు బడ్జెట్ కేటాయించి ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకుంది.

- టీసీ వరుణ్, అహుడా చైర్మన్

మహిళలకు ప్రాధాన్యం..

బడ్జెట్‌లో మహిళల సంక్షేమానికి పెద్ద పీట వేశారు. మహిళల ఆర్థిక స్వావలంబన, అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయం. దీపం, ఉచిత గ్యాస్, స్వయం సహాయ సంఘాల బలోపేతానికి కేటాయించిన నిధులు మహిళల ఆత్మ విశ్వాసాన్ని పెంచుతాయి.

- స్వరూప, మాజీ మేయర్

విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక..

ఉద్యోగులు, సిబ్బంది వేతనాలకు చాలినన్ని నిధులు కేటాయించడం హర్షణీయం. వర్సిటీలు, రీసోర్స్ సెంటర్లు, డిగ్రీ కళాశాలలు, బీఈడీ, ఎంపీడీ ట్రైనింగ్ కళాశాలలు, ప్రతిభ స్కాలర్‌షిప్‌లు, క్రీడలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఇలా అన్నిటిని ప్రత్యేకంగా విభజించి, వాటి అభివృద్ధికి నిధులు కేటాయించారు. విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు బడ్జెట్ కేటాయింపుల ద్వారా స్పష్టమవుతోంది.

-ప్రొఫెసర్ అనిత, ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ

మల్బరీ సాగుకు ఊతం..

వ్యవసాయ రంగానికి రూ.11636 కోట్లు కేటాయించడం అనుబంధ రంగమైన పట్టుపరిశ్రమ బలోపేతానికి దోహదపడుతుంది. మల్బరీ సాగుకు ఊతమిస్తుంది. ఇప్పటికే వేల ఎకరాల్లో మల్బరీ సాగు చేయడం ద్వారా వందల కుటుంబాలు స్వయం ఉపాధి పొందుతున్నాయి. ఈ సంఖ్యను రెట్టింపు చేసేలా బడ్జెట్ కేటాయింపులున్నాయి.

-ఆంజనేయులు, పట్టుపరిశ్రమశాఖ జిల్లా అధికారి

విపక్షాల నోరు మూత..

విపక్షాల నోళ్లు మూయించే విధంగా బడ్జెట్ కేటాయింపులున్నాయి. ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్ రూపొందించారు. వ్యవసాయరంగం, బీసీలకు పెద్ద పీట వేయడం హర్షనీయం. ముఖ్యంగా హంద్రీనీవాకు ఇదివరకూ ఎన్నడూ లేని విధంగా రూ. 3 వేలకోట్ల పైచిలుకు నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని విధాలుగా నష్టపోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజల్లో ఆశలు నింపేలా... వారి ఆర్థిక జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. -పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే

ఆకాంక్షలు నెరవేరేలా..

ప్రజల ఆకాంక్షలు నెరవేరేలా బడ్జెట్ ఉంది. మొత్తం బడ్జెట్‌లో దాదాపు 6 శాతం ఆరోగ్యం, వైద్యవిద్యకు కేటాయించారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా నిధులను కేటాయించారు. వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తే కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి ఊదింది. అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు నిధులు కేటాయించారు.

- సత్యకుమార్ యాదవ్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి

బడ్జెట్ సూపర్..

• ఇదీ.. మెజార్టీ వర్గాల అభిప్రాయం • విపక్షాల పెదవి విరుపు

కూటమి ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ 'సూపర్' అని అత్యధికమంది అభిప్రాయపడ్డారు. కూటమి పార్టీలపైన టీడీపీ, బీజేపీ, జనసేన బడ్జెట్ కేటాయింపులపై హర్షం వ్యక్తం చేశాయి. సంక్షేమం, అభివృద్ధి బడ్జెట్ అని, ఎన్నికల హామీలు నెరవేర్చే బడ్జెట్ అని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఆయా పార్టీల నాయకులు అభివర్ణించారు. వైసీపీ పాలనలో అతలాకుతలమైన వివిధ వర్గాలకు పునరుజ్జీవనానికి, పునర్నిర్మాణానికి ఈ బడ్జెట్ ఊతమిస్తుందన్నారు. వ్యవసాయరంగ ప్రగతికి, సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. షరా మామూలుగానే వైసీపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, కార్మిక సంఘం నాయకులు బడ్జెట్‌పై పెదవి విరిచారు.

- న్యూస్ నెట్‌వర్క్ ఆంధ్రజ్యోతి

నీకు పదిహేను..!

ఉమ్మడి జిల్లాలో తల్లికి ఘనంగా వందనం

6,23,827 మందికి రూ.935 కోట్లకు పైగా..

అనంతపురం విద్య, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కూటమి ఎన్నికల ప్రచారంలో కీలకమైన 'తల్లికి వందనం' అమలులోకి వస్తోంది. ఈ పథకానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.9,407 కోట్లు కేటాయించారు. పయ్యావుల పద్దులో సూపర్ సిక్స్‌లో కీలకమైన ఈ పథకానికి ప్రాధాన్యం లభించింది. ఇచ్చిన హామీ మేరకు ప్రతి తల్లికీ 'వందనం' సమర్పించేందుకు నిధులు కేటాయించారు. వైసీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడిని ఒక్కరికే పరిమితం చేశారు. కానీ కూటమి ప్రభుత్వం ఒక తల్లికి ఎంతమంది బిడ్డలున్నా.. అందరికీ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. గత ప్రభుత్వం రూ.15 వేలు ఇస్తామని చెప్పినా.. రూ.2 వేలు కోత పెట్టింది. ఇప్పుడు అలా కాకుండా.. ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు చెల్లిస్తారు. అనంతపురం జిల్లాలో 2,417 పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ 3,99,293 మంది విద్యార్థులు ఉన్నారు. ఇంటర్‌లో మొదటి ఏడాదిలో 25,730 మంది, ద్వితీయ సంవత్సరం 22,960 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తంగా 4,47,983 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున ప్రభుత్వం అందజేస్తుంది. దీనికోసం జిల్లాకు రూ.671 కోట్లకు పైగా అవసరమౌతుంది. శ్రీసత్యసాయి జిల్లాలో 1,75,844 మంది విద్యార్థులకు రూ.263.76 కోట్లకు పైగా అందనుంది. విధి విధానాల రూపకల్పన తరువాత గణాంకాలపై స్పష్టత వస్తుంది.



బడ్జెట్ ప్రతిని చదువుతున్న మంత్రి సవిత, సమావేశాలలో పురం ఎమ్మెల్యే బాలకృష్ణ

మానవ వనరుల అభివృద్ధికి గట్టి పునాది..

మానవ వనరుల అభివృద్ధికి గట్టి పునాది నిర్మించేలా బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించడం హర్షణీయం. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యాశాఖను బలోపేతం దిశగా బడ్జెట్ ఉంది. ఇంటర్మీడియేట్ వరకు తల్లికి వందనం, ఉన్నత విద్యనభ్యసించే వారికి స్కాలర్‌షిప్ రూపంలో ఆర్థిక ప్రోత్సాహం అందించనున్నారు. నైపుణ్య శిక్షణ, ఇంటర్న్‌షిప్ అంశాలు ఉద్యోగ, ఉపాధిని కల్పించేందుకు దోహదపడుతాయి.

-ప్రొఫెసర్ సుదర్శనరావు, జేఎన్టీయూ వీసీ

దగా బడ్జెట్...

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను దగా చేసేదిగా ఉంది. బడ్జెట్ సంఖ్య ఘనం... కేటాయింపులు శూన్యమన్నట్లుగా కనిపిస్తోంది. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా... ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేమనే సంకేతాలను బడ్జెట్ ద్వారా పంపారు. సూపర్ సిక్స్ పథకాలకు పంగనామాలు పెట్టారు. ఇది ముంచే ప్రభుత్వమని తొలి బడ్జెట్‌లోనే నిరూపితమైంది.

- దాదాగాంధీ, కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు

నిరాశ పరిచింది

వార్షిక బడ్జెట్ ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్రంగా నిరాశపరిచింది. బడ్జెట్‌లో 12వ పీఆర్సీ ఆర్థిక బకాయిలు ఊసేలేకపోవడంతో తీవ్ర మనోవేదన కలుగుతోంది. 12వ పీఆర్సీకి కనీసం చైర్మన్‌ను ప్రభుత్వం నియమించకపోవడం, పీఆర్సీ అమలు చేసేలోపు ఐఆర్ ఇచ్చేందుకు నిధులు కేటాయించకపోవడం దారుణం. పీఆర్సీ ఆర్థిక బకాయిల కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేయడమే.

- సుధాకర్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

రెండు కళ్లుగా..

అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా భావించి రూపొందించిన బడ్జెట్ ఇది. సామాన్యుల సంక్షేమానికి ఇదో అత్యుత్తమ బడ్జెట్. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు రూ. వేల కోట్లు నిధులు కేటాయించి చిత్తశుద్ధిని చాటారు. ఆదరణ పథకానికి రూ. 1000 కోట్లు కేటాయించి పునర్జీవం పోశారు.

- బీవీ వెంకటరాముడు, టీడీపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్

ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేలా..

గత ప్రభుత్వ విధ్వంస పాలన కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయింది. ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని స్థితిలో నుంచి రాష్ట్ర పునర్నిర్మాణం వైపు అడుగులు వేసే విధంగా బడ్జెట్ రూపకల్పన జరిగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేదల సంక్షేమానికి ఈబడ్జెట్‌లో పెద్దపీట వేశారు. అమరావతి నిర్మాణం, పోలవరంతోపాటు ఇరిగేషన్ శాఖకు పెద్దపీట వేస్తూ రైతాంగాన్ని ఆదుకొనేందుకు ఈ బడ్జెట్ బాటలు వేస్తోంది.

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి

కార్మికులకు ఒరిగింది లేదు..

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికులకు ఒరిగిందేమిలేదు. సామాన్యుల సంక్షేమానికి పెద్దపీట వేశామని చెప్పుకుంటున్న బడ్జెట్‌లో షాపులు, ప్రైవేట్ ఆసుపత్రులు, పెట్రోలు బంకులు, హోటల్స్‌లో పనిచేసే లక్షలాది మంది కార్మికులకు వేతనాలు పెంచేచర్యలు బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం దారుణం. వేతనాలు, కూలికోసం పనిచేసే వారికి సంక్షేమపథకాలు మాత్రమే సంతృప్తి ఇవ్వలేవు. భవన నిర్మాణ బోర్డు పునరుద్ధరిస్తామన్న మాట, ఆశావర్కర్ల వేతనాలు, అంగన్వాడీల గ్రాట్యుటీ, భవననిర్మాణ సంక్షేమ నిధులు, వంటివాటిపై బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం దురదృష్టకరమన్నారు. - ఈఎస్ వెంకటేశు సీఐటీయూ, జిల్లా కార్యదర్శి

ప్రత్యేక నిధులు కేటాయించాలి...

బడ్జెట్‌లో ఉన్నత విద్యకు నిధులు కేటాయించడం హర్షణీయం. న్యాయ విద్యకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. రెండు, మూడు, ఐదు సంవత్సరాల న్యాయ విద్య కోర్సులను అభ్యసించాలంటే రూ.లక్షలు ఖర్చుచేయాల్సి వస్తోంది. దీంతో పేద విద్యార్థులకు న్యాయవిద్య భారంగా మారుతోంది. వచ్చే బడ్జెట్‌లోనైనా ప్రత్యేక నిధులు కేటాయించేందుకు కృషి చేయాలి.

-బానాసి నారాయణప్ప, బీఎల్ఎఫ్ రాష్ట్ర, అధ్యక్షుడు

వరంలా ఉచిత విద్యుత్...

గుంత మగ్గానికి 200, పవర్ లూమ్‌కు 400 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం ఆ వర్గాలకు ఎంతో ఉపయోగకరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తాధ్వర్యంలో అనేక రాయితీ పథకాలు అందిస్తున్నాం. వీటికి తోడుగా బడ్జెట్‌లో చేనేతలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ వరాన్ని ఇచ్చింది.

- శ్రీనివాసులరెడ్డి, జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ

నైపుణ్యానికి పెద్దపీట..

విద్యతో సమానంగా నైపుణ్యాలు నేర్పించేలా బడ్జెట్‌లో కేటాయింపులున్నాయి. ఇవి నైపుణ్య మెలకువలు నేర్పేందుకు తోడ్పడతాయి. తద్వారా ప్రతి విద్యార్థి ఉద్యోగ, ఉపాధి పొందే అవకాశం ఏర్పడుతుంది.

-ప్రతాప్‌రెడ్డి, జిల్లా నైపుణ్య శిక్షణాభివృద్ధి అధికారి

ఏ మాత్రం సరిపోవు..

ప్రభుత్వ విద్యారంగానికి బడ్జెట్‌లో 9.86 శాతం నిధులనే కేటాయించారు. 12వ పీఆర్సీ కోసం, బకాయిల చెల్లింపుల కోసం నిధులు ఇవ్వకపోవడం దారుణం. ఈ ఏడాది బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.31,805 మాత్రమే ఇచ్చారు. ఈ నిధులు ప్రభుత్వ బడుల బలోపేతానికి ఏమాత్రం సరిపోవు. గత ప్రభుత్వం పాఠశాల విద్యను విచ్ఛిన్నం చేసింది. అదే బాటలోనే ఈ ప్రభుత్వం కూడా నడుస్తోంది.

- శెట్టిపి జయచంద్రారెడ్డి, యూటీఎఫ్‌రాష్ట్ర కార్యదర్శి

ఏమాత్రం ఉపయోగపడదు..

రాష్ట్ర బడ్జెట్ పేదల సంక్షేమానికి ఏ మాత్రం ఉపయోగపడదు. కరువుతో ఇబ్బంది పడుతున్న రాయలసీమ రైతులకు ఈ బడ్జెట్‌తో ఒరిగింది శూన్యం. వ్యవసాయం తరువాత అతిపెద్ద పరిశ్రమ చేనేతను కూడా చిన్నచూపు చూశారు.

- మధు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ధర్మవరం

పాఠశాలలకే రూ.31,806 కోట్లు...

చదువుకు గట్టి పునాదులు వేసేలా పాఠశాలలకే రూ.31,806 కోట్ల నిధులు కేటాయించడం అభినందనీయం. ఇది పేద వర్గాలకు వరం. విద్యావ్యవస్థలోని అన్ని ప్రక్రియలు సజావుగా సాగేలా నిధులు కేటాయించడం హర్షణీయం.

-డాక్టర్ రామచంద్ర, మండల విద్యా శాఖ అధికారుల సంఘం రాష్ట్ర నేత

మైనార్టీలకు పెద్దపీట...

బడ్జెట్‌లో మైనార్టీలకు పెద్ద పీట వేశారు. వైసీపీ పాలనలో మైనార్టీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేస్తే... కూటమి ప్రభుత్వం దానికి జీవం పోసే విధంగా నిధులు కేటాయించడం అభినందనీయం. బడ్జెట్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 5434 కోట్లు కేటాయించి ఆ వర్గాల జీవనప్రమాణాల పెంపునకు కృషి చేయడం సంతోషకరం. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లకు మైనార్టీల పక్షాన కృతజ్ఞతలు.

- కేఎం జకీవుల్లా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి

అంకెల గారడీ

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడీనే. బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా పేద, బడుగు, బలహీన వర్గాలు, రైతులు, మహిళలను కూటమి ప్రభుత్వం మోసం చేసింది. మహిళా శక్తికి నిధులు కేటాయించలేదు. ఉచిత బస్సు నిరుద్యోగభృతి జాడలేదు. దీపం పథకాన్ని 90లక్షల మందికే కుదించడం దారుణం. ధరల స్థిరీకరణ నిధికి కేటాయించిన నిధులు ఏమాత్రం సరిపోవు.

- శివరామిరెడ్డి, శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్



అసెంబ్లీలో ఆర్థిక మంత్రి కేశవ్ ప్రసంగం

సాగునీటికి అరకొరే...

బడ్జెట్‌లో సాగునీటి వనరుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించలేదు. గత బడ్జెట్‌లో రూ.2014.24 కోట్లు కేటాయించి రూ.1765 కోట్లు ఖర్చు పెట్టారు. గత ప్రభుత్వం కంటే బడ్జెట్ కేటాయింపులు మెరుగైనప్పటికీ జిల్లా అవసరాలకు తగ్గట్టుగా ఖర్చులు లేవు. ఈ ఏడాది రూ. 3446 కోట్లు కేటాయించినప్పటికీ... ఇందులో హంద్రీనీవా విద్యుత్ బిల్లులకే రూ. 1000 కోట్లు ఖర్చవుతుంది. ఉద్యోగుల వేతనాలుపోగా మిగిలేది కొంతే. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి ప్రజలపై భారాలు వేసే విధంగా బడ్జెట్ ఉంది. అనుకున్న మేరకు ఆదాయం రాలేదనే సాకుతో పథకాలకు కోత పెట్టే పరిస్థితి కనిపిస్తోంది. యువతకు నిరుద్యోగ భృతిని ప్రస్తావించికపోవడం అన్యాయం.

- రాంభూపాల్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యులు

ఎంతో ఉపయోగం..

రాష్ట్ర బడ్జెట్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. పరిశ్రమలు, విద్య వైద్యం తదితర వాటికి బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించారు. వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయానికి మొండి చేయి చూపారు. కూటమి ప్రభుత్వం బడ్జెట్ వ్యవసాయానికి పెద్దపీట వేసింది.

- చిలకం మధుసూదన్‌రెడ్డి, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా..

రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ఉంది. వ్యవసాయం, నీటి పారుదల రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయం. మహిళలు, మధ్యతరగతి ప్రజలు, యువత, రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడేలా ఉంది. సూపర్‌సిక్స్‌లో భాగమైన తల్లికి వందనం అమలులోకి తేవడం హర్షనీయం.

- అంజినప్ప, టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు

అద్భుతమైన బడ్జెట్..

బడ్జెట్ అద్భుతంగా ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి, వ్యవసాయం, విద్య, వైద్యం తదితరాలకు పెద్ద పీట వేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. నవ్యాంధ్ర నిర్మాణానికి ఈ బడ్జెట్ దోహదపడుతుంది.

- జీఎం శేఖర్, బీజేపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు

అనుభవానికి తార్కాణం..

రాష్ట్ర పరిపాలన, అభివృద్ధి, సంక్షేమంపై పట్టుసాధించిన అనుభవానికి ఈ బడ్జెట్ తార్కాణంగా నిలుస్తోంది. దశాబ్దాల నుంచి ప్రజల్లో మమేకమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌లు అన్ని రంగాలను ఆర్థిక పరిపుష్టిని సాధించేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం అభినందనీయం. విద్య, వైద్య, నైపుణ్య శిక్షణ, వ్యవసాయం, నీటి వనరులు, పరిశ్రమలు ఇలా అన్ని రంగాలకు సమంగా నిధులు కేటాయించి వారి అనుభవాన్ని చాటుకున్నారు.

- కొనకొండ్ల రాజేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

హర్షణీయమే కానీ...

బడ్జెట్ కేటాయింపులు హర్షణీయమే కానీ, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు నిధులివ్వకపోవడం బాధాకరం. గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలపై వేల సంఖ్యలో దాడులు, హత్యలు, అత్యాచార కేసులు నమోదయ్యాయి. బాధితులకు అట్రాసిటీ కేసు కింద పరిహారం చెల్లించాలంటే నిధుల్లేవు. సబ్‌ప్లాన్ కింద ఖర్చు చేయాల్సిన నిధులను ఇతరాలకు మళ్లించారు. కార్పొరేషన్ ద్వారా అమలు చేయాల్సిన పథకాలకు డబ్బు లేవంటున్నారు.

-సాకే హరి, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

విద్య, వసతికి నిధులు...

సాధారణ విద్యార్థులు ఐటీఐ కోర్సులపట్ల మొగ్గు చూపేలా బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయి. తల్లికి వందనం, హాస్టల్ వసతి పొందేందుకు స్కాలర్‌షిప్‌ను కేటాయింపులు విద్యార్థులకు వరం. పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థులు ఒకట్రెండు సంవత్సరాల ఐటీఐ కోర్సులు పూర్తిచేసి, ఉద్యోగాలకు వెళ్తున్నారు. చిన్న వయసులోనే విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

-రామమూర్తి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల

మైనార్టీల పక్షపాతి..

టీడీపీ మైనార్టీల పక్షపాతి అని మరోసారి నిరూపితమైంది. బడ్జెట్‌లో మైనార్టీలకు భారీగా నిధులు కేటాయించడం హర్షనీయం. అన్ని వర్గాలతోపాటు మైనార్టీలకు పెద్ద పీట వేశారు. వైసీపీ ప్రభుత్వం మైనార్టీలను ఓటు బ్యాంకుగానే చూసింది. గతంలో మైనార్టీలకు అందించిన సంక్షేమ పథకాలను తీసేసి తీరని అన్యాయం చేసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిం మైనార్టీల సంక్షేమం, రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

- గౌస్‌మొహిద్దీన్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్

రేపటి నుంచి దాదులూరు పరుష



పోతలయ్యస్వామి మూలవిరాట్

కనగానపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారమైన దాదులూరు పోతలయ్య స్వామి పరుష ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ పరుష సందర్భంగా పోతలయ్య, చెన్నకేశవ, బంగారు లింగమయ్య స్వాములను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తారు. ఈ పరుషకు మన రాష్ట్రం నుంచే కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు. ఆదివారం కలికివాండ్లపల్లి బిజారీ వంశీయులు ఎలవగంప తీసుకురావడంతో జాతర ప్రారంభమవుతుంది. రెండో రోజు జ్యోతులు, బోనాలు, ఫలహారపు బండ్లతో ఆలయ ప్రదక్షిణలు చేసి ముక్కులు తీర్చుకుంటారు. జాతరలో ప్రధానఘట్టమైన గావుల మహోత్సవం మంగళవారం తెల్లవారుజామునే జరగనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు జంతుబలులు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

నైతిక విలువలతోనే జీవితానికి సార్థకత

- పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా



మాట్లాడుతున్న ఉమర్ అలీషా

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నైతిక విలువలు, క్రమశిక్షణ అలవరుచుకుంటేనే జీవితానికి సార్థకత చేకూరుతుందని విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా పేర్కొన్నారు. డాక్టర్ ఉమర్ అలీషా సాహితీ సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక లలితకళా పరిషత్‌లో 'భారతదేశం-మత సామరస్యం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆకాశవాణి సీనియర్ వ్యాఖ్యాత జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ ఉమర్ అలీషా ముఖ్యఅతిథిగా హాజరై సందేశమిచ్చారు. మతం ఏదైనా మానవత్వమే బోధిస్తుందన్నారు. మానవసేవే మాధవసేవగా భావించి ఆధ్యాత్మిక చింతనతో సేవామార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. మానవ మేధస్సును విధ్వంసం కోసం కాకుండా సమాజ వికాసం, ఉత్తమ మానవ జీవనంకోసం ఉపయోగించాలన్నారు. ఆ దిశగా ఎంతోమంది మహనీయులు సమాజ చైతన్యంకోసం కృషి చేశారనీ, వారిలో కవిశేఖరుడు డాక్టర్ ఉమర్ అలీషా విజ్ఞానవంతమైన సమాజ సృష్టికి తోడ్పడ్డారని తెలిపారు. విద్యార్థులందరినీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, లలితకళాపరిషత్ ప్రధాన కార్యదర్శి గాజుల పద్మజ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, రచయితలు డాక్టర్ పతికి రమేష్‌నారాయణ, దాయన చంద్రజీ, ద్విభాషా కవి జూటూరు షరీఫ్, రియాజుద్దీన్, మురళీకృష్ణ, నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి పాల్గొన్నారు.

3 నుంచి పారా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి 4వ పారా వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ఈనెల మూడు నుంచి అశోక్ నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించనున్నట్లు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్లు శుక్రవారం స్థానిక దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో ఏడీ వినోద్‌కుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు. జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఏడీ తెలిపారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు ఆధార్‌కార్డు, క్రీడా సామగ్రి, యూనిఫాంతో ఇండోర్‌స్టేడియంలో హాజరుకావాలని కోరారు. విజేతలైన క్రీడాకారులు మార్చి 16 నుంచి ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో నిర్వహించే జాతీయస్థాయి పారా వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 9390388169, 8074106154ను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి పశువులకు టీకా కార్యక్రమం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం నుంచి గాలికుంటు వ్యాధి నివారణ ఉచిత టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రామచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో విడత ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమాన్ని మార్చి నెలాఖరుదాకా నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని 349800 పశువులకు టీకా వేస్తామన్నారు. 9500 పెయ్య దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకా వేస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబేడ్కర్ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో చేరగోరు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగజ్యోతి తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. 2025-26 సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కోర్సు ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుందన్నారు. కళాశాలలో ఎంపీసీ 80సీట్లు, బైపీసీ 80సీట్లు ఉన్నాయన్నారు. మార్చి ఆరో తేదీలోపు అర్హులైనవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెబ్ సైట్ : apcfss.in నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ ఆరో తేదీ మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4:30గంటల వరకు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9573582804, 9490363701 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పోండి.. ఇక్కన్నుంచి..!

- నీలం సంజీవరెడ్డి స్టేడియంలోకి రావద్దు
- క్రీడాకారులను బయటకు పంపుతున్న పోలీసులు
- స్పోర్ట్స్ ప్రాక్టీస్, కోచింగ్‌కు నిరాకరణ
- ఆందోళనలో కోచ్‌లు, క్రీడాకారులు
- శాప్, కలెక్టర్ వద్దకు చేరిన పంచాయితీ



పీటీసీ స్టేడియం గేటుకు నిబంధనల ఫ్లెక్సీ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకే తలమానికంగా నిలిచిన స్థానిక నీలం సంజీవరెడ్డి పోలీసు శిక్షణ కళాశాల (పీటీసీ) స్టేడియంపై ప్రస్తుతం రచ్చ జరుగుతోంది. స్టేడియంలోకి క్రీడాకారులను, శిక్షకులను అనుమతించడంలేదు. పోలీసుల తీరుతో ఈ స్టేడియం ఎవరిదన్న చర్చ తెరపైకి వచ్చింది. 1964లో అప్పటి స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రూ.1.77 లక్షల నిధులతో నీలం సంజీవరెడ్డి పేరుతో స్టేడియం నిర్మించారు. అప్పటికే ఇక్కడ పోలీసు శిక్షణ కళాశాల ఉంది. దీంతో స్టేడియాన్ని పీటీసీకి స్వాధీనం చేశారు. ఇక అప్పటి నుంచి పీటీసీ ఆధ్వర్యంలోనే స్టేడియం నిర్వహిస్తున్నారు. తాజాగా క్రీడాప్రాక్టీస్, శిక్షణతోపాటు పోటీలకు అనుమతి లేదంటూ పీటీసీ అధికారులు ప్రకటించారు. దీంతో క్రీడాకారులు, కోచ్‌లు ఆందోళనలో పడ్డారు. స్టేడియంలో క్రికెట్, వాలీబాల్,ఇతర క్రీడా కోచింగ్, ప్రాక్టీస్ సమయాల్లో బెట్టింగ్‌కు పాల్పడుతూ... క్రీడాకారులు ఘర్షణలకు దిగుతున్నారనే ఆరోపణలతోనే అనుమతి ఇవ్వడం లేదని పీటీసీ అధికారులు చెప్పుకొస్తున్నారు. 30 ఏళ్లుగా ఒకే వ్యక్తి క్రికెట్ కోచింగ్ పేరుతో క్రికెటర్ల నుంచి లక్షలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ... వారితోనే తన స్పోర్ట్స్ షాపులో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. పీటీసీ మొత్తం సుమారు 50ఎకరాల్లో నగర నడిబొడ్డున ఉంది. ప్రస్తుతం నగరం అభివృద్ధి, విస్తరణతో పీటీసీని శివారులోకి మారుస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో పీటీసీలో క్రీడలు, కోచింగ్, ప్రాక్టీస్‌కు అనుమతిస్తారా, లేదా అన్నదానిపై స్పష్టత లేదు. పైగా పీటీసీ పంచాయితీ.. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఉన్నతాధికారులు, కలెక్టర్ వద్దకు చేరింది. ఎలాంటి పరిష్కారం చూపుతారో వేచిచూడాల్సిందే.

బెట్టింగ్ సాకు..

నీలం సంజీవరెడ్డి స్టేడియంలో 30 ఏళ్లుగా క్రికెట్ తదితర క్రీడల కోచింగ్, నెట్‌ప్రాక్టీస్ సాగుతోంది. ఒకే వ్యక్తి ఇక్కడ క్రికెట్ కోచింగ్ ఇస్తున్నారు. నెట్ ప్రాక్టీస్ సందర్భంగా జరిగిన బెట్టింగ్‌లు, ఘర్షణలను సాకుగా తీసుకుని స్టేడియంను పోలీసులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఉచిత కోచింగ్ పేరుతో క్రీడాకారుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేయడం, కోచ్‌కు సంబంధించి స్పోర్ట్స్ షాపులో క్రీడాకారులతో పనులు చేయించుకోవడం వివాదాస్పదమైంది. ఆ కోచ్ గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధిగా సైతం ఎన్నికయ్యారు. అప్పట్లో అధికారం అండతో హవా కొనసాగించారు. జిల్లా జట్టుకు క్రికెటర్ల ఎంపికలోనూ తన వద్ద శిక్షణ తీసుకున్న వారికే అవకాశం ఇవ్వాలని డిమాండ్లు పెట్టినట్లు చర్చకు వచ్చాయి. క్రికెట్ కోచింగ్, నెట్ ప్రాక్టీస్ సమయంలో బెట్టింగ్ ఆడుతున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఇదే సాకుతోనే స్టేడియంలోకి క్రీడలు, క్రీడాకారులకు కోచింగ్‌కు అనుమతి ఇవ్వకూడదని పీటీసీ అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. ఎవరో చేసిన తప్పుకు మొత్తం క్రీడాకారులను బలిపెట్టడం ఏమిటనే విమర్శ వస్తోంది. బెట్టింగ్, ఇతర తప్పిదాలు ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, ఇలా స్టేడియంలోకి రానివ్వకపోవడం సరికాదని నగర ప్రజలు అంటున్నారు.



యంత్రంతో క్రీడా శిక్షణ ఏర్పాట్ల తొలగింపు

ఎవరిదో..?

నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియం ఎవరి ఆధ్వర్యంలో ఉంది, ఇందులో క్రీడలకు ఎవరెవరికి అనుమతి ఉంటుంది అనే అంశంపై తీవ్ర చర్చ సాగుతోంది. 1964లో అప్పటి ఏపీ స్పోర్ట్స్ కౌన్సిల్ పీటీసీలో రూ.1.77 లక్షల నిధులతో స్టేడియం నిర్మించింది. ఇందులో ఏపీ స్పోర్ట్స్ కౌన్సిల్ రూ.50వేలు, కేంద్రప్రభుత్వం రూ.25వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.50వేలు, ఇతర నిధులు రూ.52,395 ఉన్నాయి. తర్వాతి కాలంలో స్పోర్ట్స్ కౌన్సిల్ కాస్తా... శాప్‌గా రూపాంతరం చెందింది. పీటీసీ స్టేడియం పూర్తిగా పోలీసుల కంట్రోల్‌లోకి వెళ్లింది.



నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియం

శాప్, కలెక్టర్ వద్దకు పంచాయితీ

పీటీసీ స్టేడియంలో క్రీడలు, శిక్షణకు అనుమతించకపోవడంపై క్రీడాకారులు, కోచ్‌లు.. ఇటీవల జిల్లాలో పర్యటించిన శాప్ చైర్మన్ రవినాయుడు దృష్టికి తీసుకొచ్చారు. శాప్ చైర్మన్ సూచన మేరకు జిల్లా కలెక్టర్, శాప్ ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా నివేదికను డీఎస్‌డీఓ పంపారు. అటు శాప్, ఇటు జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని పీటీసీ స్టేడియంలోకి క్రీడాకారులను కోచింగ్, ప్రాక్టీస్‌కు అనుమతిస్తారా, ప్రత్యామ్నాయం చూపిస్తారా అన్నదానిపై స్పష్టత లేదు.

పీటీసీని తరలిస్తారా?

నగరానికి దూరంగా 60 ఏళ్ల క్రితం పీటీసీని నిర్మించారు. నగరం అభివృద్ధి చెందడంతో నడిబొడ్డుకు చేరింది. ఈ నేపథ్యంలో మంచి వాతావరణం, స్వచ్ఛమైన గాలి, వెలుతురు కోసం పీటీసీని నగర శివారు ప్రాంతానికి మారుస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అదే జరిగితే.. ఆ ప్రాంతం మొత్తం క్రీడాశాఖకు అప్పగించి, నీలం సంజీవరెడ్డి స్టేడియాన్ని మరింత అభివృద్ధి చేసి ఆధునిక హంగులతో అందుబాటులోకి తీసుకువస్తారా అనే చర్చ సాగుతోంది.

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం



పీటీసీ స్టేడియం.. ఎన్నో క్రీడా పోటీలకు వేదికగా నిలిచింది. ప్రస్తుతం కోచింగ్, క్రీడా పోటీల నిర్వహణకు పీటీసీ అధికారులు అనుమతించట్లేదు. ఈ నేపథ్యంలో స్టేడియంపై కలెక్టర్‌కు పూర్తి వివరాలతో నివేదిక పంపాం.

- ఉదయ్‌భాస్కర్, డీఎస్‌డీఓ

రక్షణ కవర్లతో ప్రయోజనం

- జిల్లా ఉద్యానశాఖ అధికారి నరసింహారావు



రక్షణ కవర్ల ఉపయోగం రైతులకు వివరిస్తున్న ఉద్యాన శాఖ అధికారి

గార్లదిన్నె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రక్షణ కవర్ల(ఫ్రూట్ కేర్ ఆక్టివిటిస్)తో మామిడి పండ్ల కు ఎంతో ప్రయోజనం కలుగుతుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి నరసింహారావు పేర్కొన్నారు. మండల పరిధిలోని తిమ్మంపేట గ్రామంలో రైతు ఆనంద్‌రెడ్డి మామిడి తోటలో మామిడి పండ్ల రక్షణ కవర్లపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి సాగులో క్రిమి సంహారక మందులు, కూలీలకు ఎక్కువ ఖర్చు రావడంతో పాటు గిట్టుబాటు ధర లేక రైతులు గత కొన్నేళ్లుగా నష్టపోతున్నారన్నారు. అందుకే మామిడి రైతుల కోసం ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో మామిడి పండ్ల రక్షణ కవర్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కవర్ల వినియోగం ద్వారా పండ్లపై మంగు, మచ్చలు రావన్నారు. పురుగు, ఈగల బాధ లేకుండా కాయలు నాణ్యంగా ఉంటాయన్నారు. దీంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్, హెచ్‌ఈఓ రామాంజనేయులు, వీహెచ్ఏలు గుల్‌ఫరేష, గంపరాజులు, మల్లికార్జున, లలిత, రధాకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

11 వేలు దాటిన సెల్ ఫోన్ల రికవరీ

- జిల్లా ఎస్పీ చేతులమీదుగా 1183 ఫోన్లు అందజేత



మహిళకు మొబైల్ అందజేస్తున్న జిల్లా ఎస్పీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్ల రికవరీలో 11వేల మైలురాయిని జిల్లా పోలీసులు దాటారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా ఎస్పీ జగదీష్ చేతులమీదుగా రూ.2.95కోట్ల విలువ చేసే 1183 ఫోన్లను బాధితులకు శుక్రవారం అందజేశారు. 2022 జూన్ 26న జిల్లా పోలీస్ శాఖ చాట్‌బాట్ సేవలు ప్రారంభించి చోరీకి గురైన లేదా మిస్సయిన మొబైల్ ఫోన్లను రికవరీ చేసి ప్రజలకు అందజేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు రికవరీ చేసి అందజేసిన ఫోన్ల సంఖ్య 11378కి చేరింది. ఇందులో 20 రాష్ట్రాలలోని బాధితులకు ముట్టజెప్పిన ఫోన్లు 1174. అనంతపురం జిల్లాకు చెందిన వారివి 7512. 19 జిల్లాల బాధితులకు అందజేసినవి 2692 ఫోన్లు. రికవరీ చేసి అందజేసిన ఫోన్లలో రూ.499ల నుంచి రూ.1.41లక్షల విలువైనవి ఉన్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్ల రికవరీలో దేశంలోనే అనంత పోలీసులు అగ్రస్థానంలో నిలిచారన్నారు. ఫోన్ చోరీకి గురైనా మిస్ అయినా చాట్ బాట్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సీఈఐఆర్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

రామగిరి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలికివాండ్లపల్లి గ్రామ సమీపంలోని మరువ వంకలో చేపలు పట్టడానికి వెళ్లి శుక్రవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు...బుక్కపట్నం గ్రామానికి చెందిన కొందరు సంచారజాతుల వారు నాలుగు రోజుల కిందట కుంటిమద్ది సమీపంలో గుడిసెలు వేసుకున్నారు. ఆ జాతికి చెందిన సాకే వెంకటేశులు (59)కలికివాండ్లపల్లి సమీపంలోని వంక వద్దకు చేపలు పట్టడానికి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు లోతైనా గుంతలోకి జారి పడ్డాడు. ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. స్థానికులు గమనించి అతడిని బయటకు తీసి, పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఆయన బంధువులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బైకు బోల్తా.. రైతు మృతి

రామగిరి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటిమద్ది గ్రామానికి చెందిన రైతు బోయచంద్రాయుడు(33) రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు...కుంటిమద్ది గ్రామానికి చెందిన అగ్రహారం సూర్యనారాయణ చిన్న కుమారుడు బోయ చంద్రాయుడు శ్రీహరిపురం సమీపంలోని తన తోట వద్దకు వెళ్లి గురువారం రాత్రి ద్విచక్రవాహనంలో తిరిగి ఇంటికి బయల్దేరాడు. శ్రీహరిపురం మలుపు వద్ద కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి బైకు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చంద్రాయుడు తీవ్రంగా గాయపడగా స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రేపు జిల్లా రిజిస్ట్రార్ వివాహం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి) : స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్ట్రార్(డీఆర్) భార్గవ్ ఓ ఇంటివాడు కాబోతున్నారు. ఈనెల రెండో తేదీన ఆయన వివాహం కడప నగరంలో జరగనుంది. ప్రత్యేక శిక్షణ కోసం వారం రోజుల పాటు ఢిల్లీకి వెళ్లిన డీఆర్ పెళ్లి సందర్భంగా సెలవు పెట్టారు. 20వతేదీ వరకు డీఆర్ సెలవులో ఉండనున్నారు. అప్పటివరకు ఇన్‌చార్జ్ డీఆర్‌గా డీఐజీ విజయలక్ష్మి బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

ఇమామ్‌లు, మౌజన్లకు వేతనాలు అందజేయండి

మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలోని మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్‌లు, మౌజన్లకు వేతనాలు అందజేయాలని మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి.. ముతవల్లీలను ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశా రు. ముతవల్లీలు ఆయా మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్‌లు, మౌజన్లకు వేతనాలకు సంబంధించిన చెక్కులను అందజేయాలన్నారు. జిల్లాలో పలు మసీదులకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలు యాజమాన్యాలు అందజేయలేదన్నారు. పత్రాలు అందించకపోతే ఆయా మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనాలు అందవన్నారు. 15 రోజుల్లోపు రిజిస్ట్రేషన్‌కు అవసరమైన పత్రాలను అందజేయాలన్నారు. వివరాలకు 9966647586, 9032557006 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు ఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్

క్షేత్రస్థాయి విధుల్లోకి 395 మంది ఎస్ఐలు... హాజరు కానున్న హోంశాఖ మంత్రి, డీజీపీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అనంతపురం పోలీస్ శిక్షణా కళాశాల పరేడ్ మైదానంలో శనివారం ఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్ జరగనుంది. మొత్తం 395 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లుగా 9 నెలల శిక్షణను పూర్తి చేసుకుని, క్షేత్రస్థాయి విధులకు వెళుతున్నారు. కార్యక్రమానికి హోం మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా హాజరు అవుతున్నారు. పరేడ్ ఉదయం 8.30 గంటలకు ప్రారంభమై 11.30 గంటలకు ముగుస్తుంది. అనంతరం డీపీఓలో కమాండ్ కంట్రోల్ నూతన భవన నిర్మాణానికి హోం మంత్రి భూమి పూజ చేస్తారు. పోలీస్ సంక్షేమ కార్యక్రమాల అమలును పరిశీలిస్తారు. అనంతరం తిరుగుపయనమౌతారు. మొత్తం 395 మందిలో ఎస్ఐలలో సివిల్ ఎస్ఐలు 300 మంది ఉన్నారు. వీరిలో మహిళలు 97 మంది, పురుషులు 203 మంది. మిగిలిన 95 మందిలో ఏపీఎస్పీ ఎస్ఐలు 94 మంది, ఒకరు ఏఆర్ ఎస్ఐ ఉన్నారు. వీరందరూ పురుషులే. డీజీపీ శుక్రవారం రాత్రి 9గంటలకు అనంతపురం చేరుకున్నారు. హోం మంత్రి అర్ధరాత్రి నగరానికి చేరుకుంటారు.

చీనీ కాయలు టన్ను రూ.21వేలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.21,110, కనిష్ఠంగా రూ.6,200, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 74 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.10

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 225 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.8 కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

వైద్య విద్యకు న్యాయం జోడించాలి

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ

విజయవాడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులకు న్యాయ సంబంధిత అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అభిప్రాయపడ్డారు. దీనిపై వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ఆలోచించాలని సూచించారు. విజయవాడలోని సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల 2019 బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ ఎన్వీ రమణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజంలో వైద్యులకు, న్యాయవాదులకు ఎంతో బాధ్యత ఉందని గుర్తు చేశారు. రోగికి, వైద్యులకు సంయమనం ఉండాలని చెప్పారు. ఓపికతో రోగుల సమస్యలు వింటే సగం చికిత్స చేసినట్టేనని అన్నారు. కొవిడ్‌లో 760 మంది వైద్యులు రోగులకు సేవలందించి ప్రాణాలర్పించారని, అటువంటి వైద్యులపై దాడులు ఎందుకు జరుగుతున్నాయో ఆలోచించుకోవాలని చెప్పారు. కమర్షియల్‌గా ఆలోచించే వైద్యులు ఎక్కువగా ఈ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

ప్రస్తుతం సామాన్యుడికి వైద్యం అందడం గగనంగా మారిందని, ఆరోగ్య వ్యవస్థంతా కార్పొరేట్ రంగంలోకి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులు, కార్పొరేట్ ఆస్పత్రుల నీడపడని ప్రాంతాలు దేశంలో చాలా ఉన్నాయని చెప్పారు. ఈ ప్రాంతాల్లో పనిచేస్తే వైద్యులు సమాజానికి మంచి సేవ చేసిన వారవుతారన్నారని సూచించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చదివే వారికి సామాజిక బాధ్యత ఎక్కువగా ఉండాలన్నారు. ప్రజలు చెల్లించిన పన్నులతో విద్యార్థులు వైద్య విద్యను అభ్యసిస్తున్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు.

న్యూస్ బాక్స్

ఇది పేదల సంక్షేమ బడ్జెట్

కదిరి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఈ బడ్జెట్.. పేదల సంక్షేమ బడ్జెట్ అని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి సోమశేఖర్ ఓ ప్రకటనలో అభిప్రాయపడ్డారు. తల్లికి వందనం, అన్నదాత సఖీభవ, పెన్షన్లు తదితర సూపర్ సిక్స్ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. ఈ బడ్జెట్‌లో అన్ని వర్గాల సంక్షేమానికి నిధులు కేటాయించి.. సమ న్యాయం చేశారన్నారు. ఆదరణ పథకానికి రూ. 1000 కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు.

కూటమి పాలనలోనే మైనార్టీల అభివృద్ధి

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : కూటమి పాలనలోనే మైనార్టీలు అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు జౌళి బాబా, మహబూబ్‌బాష, నిజాం, ఆర్ఎంపీ జాకీర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానికంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. మైనార్టీలకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇచ్చిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

గాండ్లపెంట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : గాలికుంటు వ్యాధికి పశువులకు శనివారం నుంచి టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి చెన్నకేశవనాయక్ శుక్రవారం తెలిపారు. మండలంలోని అన్ని సచివాలయ పరిధిలో ఈనెల చివరి వరకు పశువులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తామన్నారు. పశుకాపరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

25లోపు రుణాలు రెన్యువల్ చేసుకోండి

నల్లమాడ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో సహకార బ్యాంక్‌లో రైతులు తీసుకున్న రుణాలకు మార్చి 25లోపు వడ్డీ చెల్లించి.. రెన్యువల్ చేసుకోవాలని సహకార బ్యాంక్ కార్యదర్శి కేశవులు, సీఐ ఎల్ అమర్నాథ్ ఓ ప్రకటనలో కోరారు. ఆ తరువాత రెన్యూవల్ చేసుకోవాలంటే 6.5 శాతం అపరాధ రుసుం చెల్లించి రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎల్‌టీ, సీసీఎల్ లోన్లు కూడా 25 లోపు రెన్యువల్ చేసుకోవాలని, లేకుంటే 13 శాతం అదనపు వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు.

రేపు వైద్యశిబిరం

కదిరి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని స్వీప్స్ ఆసుపత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ఎండీ నిసార్, వసీం యాసిన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో అపెండిక్స్, హెర్నియా, కిడ్నీలో రాళ్లు, రొమ్ములో గడ్డలు, కొవ్వుగడ్డలు, షుగర్ పుండ్లు, మొలలు తదితర సమస్యలకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచిత శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఖాసీం మసీదు ప్రారంభం

ధర్మవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాదవవీధిలో కొత్తగా నిర్మించిన మసీద్-ఏ-ఖాశీం (ఖాసీం మసీదు)ను శుక్రవారం ప్రారంభించారు. ఇందులో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరయ్యారు. మౌలానాలు, మతపెద్దల ఆధ్వర్యంలో మానవాళి శాంతి కోసం వారితో కలిసి దువా(ప్రార్థన) చేశారు. ఇందులో ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, ముస్లీం మైనార్టీ నాయకులు నాగూర్ హుస్సేన్, 23వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ అడ్ర మహేశ్ , టీడీపీ నాయకులు చికెన్‌రాము, మాల్యవంతం నారాయణస్వామి, వెంకటేశ్, రామకృష్ణ పాల్గొన్నారు.

నీటికుంటల పనులు ప్రారంభించాలి

తనకల్లు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి):మండలంలోని అన్ని గ్రామాల్లో మార్చి ఐదులోగా ఫారంపాండ్ల పనులు ప్రారంభించాలని ఏపీడీ రమేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలానికి 170 ఫారంపాండ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇప్పటి వరకు 25 ఫారంపాండ్లు పనులను మాత్రమే ప్రారంభించారని, మిగిలిన వాటి పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఉపాధి పనులను నిర్లక్ష్యం చేయరాదని, తప్పనిసరిగా కూలీలకు పనులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డప్ప, ఏపీఓ మరియమ్మ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

ధర్మవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో విద్యార్థులకు తగు సదుపాయాలు కల్పించాలని ఆర్డీఓ మహేశ్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగ విద్యార్థులకు వీల్‌ఛైర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, నాయకులు అనిల్, శ్రీనాథ్, అమన్, సిద్దిక్ పాల్గొన్నారు.

ఆస్పత్రి తనిఖీ

ధర్మవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిని అనంతపురం డీసీహెచ్ఎస్ రవికుమార్ శుక్రవారం తనిఖీచేశారు. ఆస్పత్రిలో జరుగుతున్న మరమ్మత్తులను పరిశీలించారు. రోగులతో వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి, డాక్టర్ నజీర్, సిబ్బంది పాల్గొన్నారు.

వీల్ ఛైర్ అందజేత

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : అమడగూరు మండలం గాజులపల్లి మాతృశ్రీ వృద్ధాశ్రమంలో ఉన్న దివ్యాంగుడు బాబయ్యకు ఖిద్మత్ ఎ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ వీల్ ఛైర్‌ను శుక్రవారం అందించింది. ఇందులో ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి, ట్రస్ట్ నిర్వాహక సిబ్బంది షామీర్, నయాజ్, కుంటిమద్ది రామాంజి, అలీ, షేకింగ్‌బాబ పాల్గొన్నారు.

కూటమి హామీలు నెరవేర్చాలి: సీపీఐ

ధర్మవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని, ఇందుకోసం రాష్ట్ర ప్రత్యేక నిధులు కేటాయించాలని అన్నారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ నటరాజ్‌కు అందజేశారు. కార్యక్రమంలో చేనేత కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు పోలా లక్ష్మీనారాయణ, ప్రధా న కార్యదర్శి బుడగ వెంకటనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షుడు గుర్రం వెంకటస్వామి, ఏఐవైఎఫ్ జిల్లాకార్యదర్శి సకలరాజ, సీపీఐ నాయకులు శ్రీనివాసులు, రంగయ్య పాల్గొన్నారు.

మామిడి రైతులకు శిక్షణ

నల్లమాడ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నల్లమాడ ఏపీ మాస్ సంస్థ వారి కలెక్షన్ సెంటర్‌లో స్థానిక మామిడి రైతులకు యాజమాన్య చర్యలు, ఎగుమతి అవకాశాలపై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, జిల్లా ఏరువాక కేంద్రం అధికారి రామసుబ్బయ్య అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శంకర్‌నాయక్, రైతు సంఘం జీఈఓ నరసింహ, అగ్రికల్చర్ అధికారి రాజశేఖర్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భిక్షాటకులకు కౌన్సెలింగ్

కదిరి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): చంటి పిల్లలను పెట్టుకొని భిక్షాటన చేస్తున్న తల్లులకు పట్టణ సీఐ నారాయణరెడ్డి శుక్రవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. కౌన్సెలింగ్ అనంతరం వారిని సమత సంస్థ పునరావస కేంద్రానికి తరలించారు. వారి బాధ్యత తీసుకుంటామని ఆ సంస్థ వారు పోలీసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమత సిబ్బంది శ్రీనివాసులనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆకాశమే హద్దుగా..!





డ్రోన్ ఆపరేట్ చేస్తున్న మహిళలు (ఫైల్)

- డ్వాక్రా మహిళలకు డ్రోన్ భాగ్యం
- 80 శాతం సబ్సిడీ వర్తింపు
- జిల్లాకు మూడు యూనిట్లు
- లబ్ధిదారుల ఎంపిక పూర్తి

కొత్తచెరువు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) మహిళలకు డ్రోన్ భాగ్యం లభించనుంది. కేంద్ర ప్రభుత్వం నమో డ్రోన్ దీదీ యోజనను అమలులోకి తీసుకొచ్చింది. ఈ పథకం కింద డ్వాక్రా మహిళలకు 80 శాతం సబ్సిడీతో డ్రోన్లను అందించనున్నారు. యూనిట్ విలువలో మిగిలిన 20 శాతం బ్యాంకు రుణం ద్వారానైనా, డ్వాక్రా సంఘం సొంత నిధుల నుంచైనా చెల్లించవచ్చు. తద్వారా మహిళలకు జీవనోపాధి కల్పించాలన్నది ప్రభుత్వ యోచన. జిల్లాకు ఈ ఏడాది మూడు యూనిట్లను మంజూరు చేశారు. వాటికి ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారు. అందులో ముగ్గురిని ఎంపిక చేశారు.

● ఉపయోగాలు అనేకం ..

ప్రస్తుతం ఉపయోగిస్తున్న పంపులతో పంటకు లీటరు పురుగు మందు స్ప్రే చేయాలంటే 150 లీటర్ల నీరు అవసరం. డ్రోన్‌తో కేవలం 10 లీటర్ల నీరు సరిపోతుందని నిపునులు అంటున్నారు. తద్వారా మందు ప్రభావం పంట మొక్కలపై సరిగా పనిచేస్తుంది. 10 నిమిషాల్లోపే ఎకరాలో పిచికారీ చేయవచ్చు. దీనిని బట్టి డ్రోన్‌తో రోజులో 30 ఎకరాల్లో మందును స్ప్రే చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు.

● అర్హత, ఎంపిక, శిక్షణ ఇలా..

నమో డ్రోన్ దీదీ పథకం కింద 2024-25 నుంచి 2025-26 వరకు దాదాపు 15 వేల డ్వాక్రా హహిళలకు డ్రోన్లను అందించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇది మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. ఒక్కో యూనిట్ విలువ రూ.10 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు ఉం టుంది. ఇందులో 80 శాతం సబ్సిడీ పోను మిగతా 20 శా తం డ్వాక్రా మహిళలు భరించాల్సి ఉంటుంది. ఈపథకానికి పదో తరగతి, ఆపైన చదివినవారు అర్హులు. ఈ ఏడాదికి ప్రభుత్వం జిల్లాకు మెదటి విడత కింద 3 యూనిట్లు మంజూరు చేసింది.



15 రోజులు శిక్షణ

నమో డ్రోన్ దీదీ పథకానికి ఇప్పటి వరకు ఆరు దరఖాస్తులు వచ్చాయి. డ్రోన్ కమిటీ అర్హతను బట్టి ముగ్గరిని ఎంపిక చేసింది. వారికి విజయవాడలోని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 15 రోజులపాటు శిక్షణ ఇస్తారు. ఐదు రోజులు డ్రోన్ పైలట్, మిగిలిన 10 రోజులు డ్రోన్ మెకానిజం, పంటలకు పురుగు మందుల పిచికారీ ఎలాచేయాలి తదితరాలపై శిక్షణ ఉంటుంది.

-నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

ఉత్సాహంగా జాతీయ సైన్స్ దినోత్సవం



కొత్తచెరువు : పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

కొత్తచెరువు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని డీఈఓ కిష్టప్ప ఆధ్వర్యంలో శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులకు వకృత్వ, వ్యాసరచన పోటీలను జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్ నిర్వహించారు. ఇందులో 11 మండలాలకు చెంది న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులు 84 మంది పాల్గొన్నారు. తెలుగు మీడియంలో ఆరుగురిని, ఇంగ్లీషు మీడియంలో ఆరుగురిని విజేతలుగా ఎంపిక చేశారు. వీరికి డీఈఓ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 23 మంది గైడ్ టీచర్లు, ఏడీ లాజర్, ఎంఈఓ జయచంద్ర, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, ప్రవీన్, ఇర్షాద్‌వలి, రాజారత్నం, మనోహర్‌నాయక్, భాస్కర్ పాల్గొన్నారు.

● ధర్మవరం : స్థానిక కాకతీయ విద్యానికేతన్ లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ మేడాపురం రామిరెడ్డి, కరస్పాండెంట్ నిర్మలా జయచంద్రారెడ్డి, డైరెక్టర్లు సూర్యప్రకాశ్‌రెడ్డి, పద్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు : స్థానిక వశిష్ట ఇంగ్లీష్ మీడియా పాఠశాలలో నిర్వహించిన సైన్స్ విజ్ఞాన ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్ట్ వర్కును న్యాయనిర్ణేతలు ఎంఈఓ సురేష్, ఉపాధ్యాయులు పవన్‌కుమార్, హరినాథ్‌రెడ్డి, మహేంద్రరెడ్డి పరిశీలించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఎంఈఓ, పాఠశాల కరస్పాండెంట్ విట్టా శివశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పావని బహుమతులు అందించారు.

● బత్తలపల్లి : స్థానిక బాలికల పాఠశాలలో సైన్స్ డే నిర్వహించారు. ఇందులో ప్రధానోపాధ్యాయురాలు జయశ్రీ, ఉపాధ్యాయులు పద్మవతి, స్వరాజ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం నిలదీత



ఛైర్మన్, కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న బాధితులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తాము నెలల తరబడి తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నా.. ఎందుకు సమస్య పరిష్కరించడం లేదని స్థానిక రెండో వార్డు వాసులు ఆ వార్డు సభ్యుడు, ఛైర్మన్ తుంగా ఓబుళపతి, కమిషనర్ ప్రహల్లాదను నిలదీశారు. స్థానిక జెండా వేపమాను వద్ద వారు ఖాళీ బిందెలతో శుక్రవారం నిరసన చేపట్టారు. పన్నులేమో వసూలు చేస్తారు.. సమస్యల గురించి ఎందుకు పట్టించుకోరని ఛైర్మన్, కమిషనర్‌పై మండిపడ్డారు. మోటారు కాలిపోవడంతో ఈ సమస్య వచ్చిందని, వెంటనే మరో మోటారు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

భక్తిశ్రద్ధలతో కూష్మాండ దీపోత్సవం



కాలభైరవస్వామి

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీచక్రవర్తి థియేటర్ ఎదురుగా ఉన్న కాలభైరవస్వామి ఆలయంలో శుక్రవారం అమావాస్య కంకరధారణ, కూష్మాండ దీపోత్సవ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, దోషనివారణ పూజలు చేసినట్లు ఆలయ పూజారి ధనుంజయాచారి తెలిపారు. ప్రదోషకాలం, అమావాస్య గడియాల్లో కూష్మాండ దీపోత్సవాన్ని నిర్వహిస్తే దోషాలు తొలుగుతాయని భక్తుల విశ్వాసం. భైరవుని ఎదుట మహిళ భక్తులు గుమ్మడికాయలపై దీపాలు వెలిగించారు. అనంతరం కంకణధారణ కార్యక్రమం చేశారు.

ఆలయంలో అమావాస్య పూజలు

ధర్మవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెండేయ స్వామి ఆలయంలో మార్గశిర మాసం శుక్రవారం సాయంత్రం మహాలక్ష్మీ అమ్మవారికి అమావాస్య పూజలు నిర్వహించారు. ముందుగా మార్కెండేయ స్వామికి, కార్యసిద్ధి వినాయక స్వామికి శ్రీచక్ర సమేత మహాలక్ష్మీ అమ్మవారికి, శ్రీకాశీవిశ్వేశ్వరస్వామికి, శ్రీ అభయ ఆంజనేయస్వామి వారికి భద్రావతి భావన ఋషుల వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలియ బహుత్తమ సంఘం నాయకులు పుత్తారుద్రయ్య, జింకానాగభూషణం, మెడికల బాలకుళ్లాయప్ప, వడకల భాస్కర్ పాల్గొన్నారు.

దాడి.. ఐదుగురిపై కేసు

ధర్మవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనగర్‌లో ఓ వ్యక్తిపై శుక్రవారం దాడి చేసిన ఐదుగురిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. గూడ్‌షెడ్ కొట్టాలకు చెందిన గూడురు మారుతి చెల్లెలు అరుణ లక్ష్మీనగర్‌లో నివాసముంటోంది. అరుణను ఆమె కుమారుడు నందవర్ధన్ శుక్రవారం కొడుతుంటే.. మారుతి మందలించాడు. దీంతో మరింత ఆగ్రహంతో మరో నలుగురు వ్యక్తులను పిలుచుకొని వచ్చి.. మేనమామ మారుతిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ మారుతి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఆ ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

స్టోర్ డీలర్ షిప్ కోసం దాడి..

ధర్మవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్టోర్ డీలర్ షిప్ వదిలి వేయాలంటూ ఓ వ్యక్తిపై శుక్రవారం దాడి జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక మారుతీనగర్‌లో మోపూరి దామోదర్‌నాయుడు ఎగ్‌రైస్ బండి నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. నాలుగు నెలల క్రితం అతనికి స్టోర్ డీలర్ షిప్ వచ్చింది. ఆ డీలర్ షిప్ వదిలి వేయాలంటూ రాజేంద్రనగర్‌కు చెందిన మల్లేశ్ యాదవ్ దామోదర్‌నాయుడి ఇంటి వద్దకు శుక్రవారం వెళ్లి బెదిరించారు. అంతేకాకుండా చంపేస్తానంటూ దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ దామోదర్‌నాయుడు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. వారు మల్లేశ్ యాదవ్‌పై కేసు నమోదు చేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

తనకల్లు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాకుంటపల్లికి చెందిన ఆదెప్ప, కిష్టప్పపై శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. అదే గ్రామానికి చెందిన నగినాల వెంకట లక్ష్మమ్మను వారు కులం పేరుతో దూషించారని, దీంతో ఆమె ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

మొక్కుబడిగా మున్సిపల్ సమావేశం



కమిషనర్‌తో మాట్లాడుతున్న కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి

ధర్మవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం శుక్రవారం మొక్కుబడిగా నిర్వహించారు. అజెండాలో 21 అంశాలపై చర్చించాల్సి ఉండగా.. కేవలం ఐదింటిపై మాత్రమే చర్చించి.. మమ అనిపించారు. 2016-17లో ఎన్ఆర్‌జీఎస్ కింద చేసిన పనులకు సంబంధించిన బిల్లులు మున్సిపల్ సాధారణ నిధులు మంజూరు చేయాలనే అంశాన్ని మెజార్టీ కౌన్సిలర్లు వ్యతిరేకించడంతో ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ దాన్ని రిజెక్ట్ చేశారు. మున్సిపాలిటీలోని ట్యాంక్‌లను శుభ్రం చేసే సమయంలో ఆయా వార్డుల కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వాలని, ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని కౌన్సిలర్లు కోరారు. ఈ సమావేశంలో కమిషనర్ ప్రమోద్‌కుమార్, టీపీఓ విజయభాస్కర్, వైస్‌ఛైర్మన్ షంషాద్‌బేగం, కౌన్సిలర్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు శ్యామ్సన్, కేశవ పాల్గొన్నారు.

శిల్పారామం రూపురేఖలు మారుస్తాం : సీఈఓ



సీఈఓ స్వామినాయుడు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సందర్శకులను మరింత ఆకర్షించేలా శిల్పారామం రూపురేఖలు మారుస్తామని శిల్పారామం సీఈఓ స్వామినాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక శిల్పారామాన్ని సందర్శించిన ఆయన మాట్లాడారు. శిల్పారామంలో ఫుడ్‌కోర్టు, ఫుడ్‌కోర్టు మధ్యలో పచ్చికబయలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుత స్టాల్స్ రూపురేఖలు మారుస్తామన్నారు. వీటితో పాటు హ్యాండీక్రాఫ్ట్ మ్యూజియం ఏర్పాటు చేయాలని, అందంగా ఉండే విధంగా పూలకుండీలను, చెట్లకు పెయింట్స్, లైటింగ్ ఇతర అభివృద్ధి పనులు చేయాలని శిల్పారామం ఏఓ రమేష్‌రెడ్డిని ఆదేశించారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల నాటికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదేవిధంగా సందర్శకులను ఆకర్షించే విధంగా ఫోటోషూట్ నిర్వహణకు అక్కడక్కడ స్టిల్స్ ఏర్పాటు చేయాలని సిబ్బందికి సీఈఓ సూచించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): అమడగూరులోని చౌడేశ్వరి కల్యాణ మండపంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర ఆర్గానిక్ కన్వీనర్ చింత శరత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గో ఆధారంగా రైతులు వ్యవసాయం చేసినప్పుడే సరైన పంటలు వస్తాయన్నారు. పొలాల్లో జీవామృతం లేని కారణంగా మంచి దిగుబడి రావట్లేదని.. జీవామృతం కావాలంటే కేవలం అది గో మూత్రం ద్వారానే సాధ్యమని అన్నారు. ఇందులో వాసన్ రాయలసీమ ఇన్‌చార్జ్ ఉత్తప్ప, సెంటర్ ఫర్ సస్టేనబుల్ అగ్రికల్చర్ రాయలసీమ ఇన్‌చార్జ్ ఆదినారాయణ, 360 వ్యవస్థాపకులు దినేష్‌కుమార్, రాయలసీమ నేచరుల్స్ వ్యవస్థాపకులు కిషోర్‌కుమార్, అగ్రికల్చర్ అధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



చక్రధర్ (ఫైల్)

కొత్తచెరువు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని లొచర్ల సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నారాయణపురం గ్రామానికి చెందిన చక్రధర్ (22) అక్కడికక్కడే మరణించాడు. అతను కొత్తచెరువు నుంచి స్వగ్రామమైన నారాయనపురానికి ద్విచక్రవాహనం పై బయలుదేరాడు. ఓబులదేవరపల్లికి చెందిన క్రిష్ణారెడ్డి ట్రాక్టర్‌లో వెళ్తూ.. హంద్రీనీవా కాలువ వద్ద పెనుకొండ రహదారిపై చక్రధర్ బైక్‌ను ట్రాక్టర్ ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో చక్రధర్ అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోలీసులు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని తండ్రి చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



జయశేఖర్ మృతదేహం

తనకల్లు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువుకు చెందిన జయశేఖర్ (41) అనుమానాస్పద స్థితిలో శుక్రవారం మరణించాడు. జయశేఖర్‌కు 15 క్రితం పెళ్లి అయింది. అతను భార్యను వదిలేశాడు. ఆయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె. అతను తాగుడుకు అలవాటు పడ్డాడు. సప్లయర్స్ షాప్‌లో పనిచేస్తూ వచ్చిన డబ్బుతో తాగేవాడు. ఒక్కొక్కసారి 4, 5 రోజులకు కూడా ఇంటికి వెళ్లేవాడు కాదు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. చీకటిమానిపల్లి సమీపంలో ఆత్మిక పేపర్ మిల్లు దగ్గర అతను అనుమానాస్పద స్థితిలో మరణించి ఉండటాన్ని శుక్రవారం గమనించిన స్థానికులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి ముఖంపై దెబ్బలు, గాయాలు ఉన్నట్లు గుర్తించారు. ఆయన తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

ఎంపీపీ వాహనంపై రాయితో దాడి

సంకేపల్లిలో ఇరువర్గాల వాగ్వాదం - ఎనిమిది మందిపై కేసు





పగిలిన ఎంపీపీ కారు అద్దం, ముదిగుబ్బలో పర్యటిస్తున్న డీఎస్పీ

ముదిగుబ్బ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ శుక్రవారం స్వగ్రామమైన బీకొట్టాల నుంచి ముదిగుబ్బకు వెళ్తుండగా.. సంకేపల్లి వద్ద ఆయన కారుపై శుక్రవారం రాయితో దాడి చేశారు. మండలంలోని సంకేపల్లి సమీపంలో జరిగిన వీరనారాయణస్వామి పరుసలో టెంకాయల దుకాణదారుడు మల్లికార్జునపై ఎంపీపీ, అతని అనుచరులు గురువార దాడి చేసిన విషయం తెల్సిందే. దీంతో మల్లికార్జున వర్గం వారు సంకేపల్లి వద్ద శుక్రవారం ఎంపీపీ వాహనంపై రాయితో దాడి చేసి.. అద్దాన్ని పగలగొట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న ముదిగుబ్బ పోలీసులు వెంటనే సంకేపల్లికు చేరుకుని ఇరువర్గాల వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ ముదిగుబ్బకు చేరుకుని పోలీసు బలగాలను పిలిపించి.. 144 సెక్షన్ విధించారు. ఇరువర్గాలకు డీఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఎనిమది మందిపై కేసు నమోదు చేశారు.

మాజీ యానిమేటర్‌పై కేసు

కొత్తచెరువు ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుముల దేవరపల్లికి చెందిన మాజీ యానిమేటర్ ఆదిశేషురెడ్డి అక్రమంగా డబ్బులు డ్రా చేసినట్లు శుక్రవారం కేసు నమోదైంది. వైసీపీ హయంలో ఇతను వెలుగు సంఘాలకు యానిమేటర్‌గా పనిచేశాడు. ప్రభుత్వం మారగానే ఆ పోస్టుకు రాజీనామా చేశాడు. అయితే గ్రామసమైక్య సంఘం లీడర్, సీసీ సంతకాలు లేకుండా తలమర్ల ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లోని గ్రామసంఘం నిధులు రూ. 32 వేలు డ్రా చేసినట్లు యానిమేటర్ ఈశ్వరమ్మ, సీసీ నాగమణి గుర్తించారు. జనవరి 30న రూ. 24 వేలు, ఫిబ్రవరి ఒకటిన రూ. ఎనిమిది వేలు డ్రా చేసినట్లు ఆధారాలు లభించాయి. దీంతో శుక్రవారం వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్ సీఐ ఇందిరా తెలిపారు.

గడ్డివాముల దగ్ధం



ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఈద్గా సమీపంలో దావు బాయ్ అబ్బులు హుస్సేన్‌కు చెందిన గడ్డివాములు శుక్రవారం దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ఇటీవల సాగుచేసిన కంది, ఉలవ కట్టి ఈద్గా ప్రాంతంలోని బండపైన వాములుగా వేశామని, గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దాదాపు 15 బండ్ల కట్టి పూర్తీగా దగ్ధమైందని అన్నారు.

సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల ప్రతిభ వెలుగులోకి

హిందూపురం మునిసిపల్ చైర్మన్ రమేష్


భాష్యం పాఠశాలలో నమూనాలు పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ రమేష్


పులమతి ప్రభుత్వ పాఠశాలలో ప్రయోగాలను తిలకిస్తున్న ఉపాధ్యాయులు


పెనుకొండ బీటీఆర్ కాలనీలోని పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు

హిందూపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి సైన్స్‌ఫెయిర్ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని మునిసిపల్ ఛైర్మన్ రమేష్ అన్నారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభ ఉంటుందని, కానీ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంవల్ల వారి మేధస్సుకు పదును పెట్టవచ్చన్నారు. అంతేకాక మూఢనమ్మకాలవల్ల సమాజం ఎంతో నష్టపోతోందన్నారు. యువత విజ్ఞానాన్ని పెంపొందించుకుంటే సామాన్యులను చైతన్యవంతులు చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన నమూనాలను పరిశీలించారు. ఎల్ఆర్‌జి పబ్లిక్ పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన ఇస్రో శాస్త్రవేత్త ప్రకాశ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సైన్స్ అనేది మన చుట్టూ ఉంటుందని విజ్ఞానం గురించి వేదాల్లో చెప్పబడిందన్నారు. ఆయన విద్యార్థులు చేసిన వివిధ రకాల ప్రాజెక్ట్ నమూనాలను పరిశీలించి వారిని అభినందించారు. చైతన్య పాఠశాల, నారాయణ పాఠశాలల్లో కూడా సైన్స్ ఫెయిర్ కార్యక్రమం జరిగింది.

సైన్స్ పట్ల విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి

లేపాక్షి: విద్యార్థులు సైన్స్‌పట్ల ఆసక్తిని పెంచుకోవాలని పులమతి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. 8వ తరగతి చదువుతున్న నేసే తనూజ నీటిశుద్ధిపై తయారుచేసిన నమూనా అందరినీ ఆకర్షించింది.

సైన్స్‌పట్ల అవగాహన కలిగి ఉండాలి

పెనుకొండ రూరల్: ప్రతి విద్యార్థి సైన్స్‌పట్ల అవగాహన కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయుడు నాగార్జునుడు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గుట్టూరు జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా జాతీయ సైన్స్‌డే నిర్వహించారు. ముందుగా సర్‌సివిరామన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు.


గుట్టూరులో నమూనాలు తిలకిస్తున్న టీచర్లు

విద్యార్థులకు బహుమతుల పంపిణీ

పెనుకొండ: సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని 30పాఠశాలల్లో ఏడు అంశాలపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారులు బహుమతులు అందజేశారు. శుక్రవారం బీటీఆర్ కాలనీ పాఠశాలలో ఎంఈఓ చంద్రశేఖర్, సుధాకర్‌ల ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో జరిగిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓల చేతులమీదుగా బహుమతులు అందించారు.

శాస్త్రవేత్తల కృషి ఫలితమే మన జీవితం

ఎందరో శాస్త్రవేత్తల కృషి ఫలితమే ఈరోజు మేము అనుభవిస్తున్న జీవితమని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయప్ప అన్నారు. ఆయన ఆధ్వర్యంలో సర్‌సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకురాలు డా.శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పట్ల ఆసక్తిని పెంచుకుని సమాజంలోని సమస్యలను పరిష్కరించడం కోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. వికసిత భారత్ 2047కోసం కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సంజీవరెడ్డి, రాధ, ఖాలిద, విద్యార్థులు పాల్గొన్నారు. వికసిత భారత్ 2047కోసం కృషిచేయాలన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పెనుకొండ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం నుంచి రెండు కేంద్రాల్లో నిర్వహించే ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 230మంది, ఒకేషనల్188, మొత్తం 418మంది రెండో సంవత్సరం రెగ్యులర్ 129, ఒకేషనల్ 197, మొత్తం 226మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 16గదులను ఏర్పాటు చేశామని 17మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. గదుల్లో ఫ్యాన్లు, తాగునీరు, వెలుతురు సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 8:30కే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. డిపార్ట్‌మెంటల్ అధికారిగా దామోదరం, చీఫ్ సూపరింటెండెంట్‌గా సుదర్శన్, వ్యవహరిస్తారన్నారు. అనంతరం పరీక్ష నిర్వహణపై ఇన్విజిలేటర్లతో ప్రిన్సిపాల్ సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు అందజేశారు.


పరీక్షకు సిద్ధమైన తరగతి గదులు

సత్యసాయి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 165మంది విద్యార్థులు రాయనున్నారు. డిపార్ట్‌మెంటల్ అధికారిగా నరసింహమూర్తి, చీఫ్ సూపరింటెండెంట్‌గా రామాంజనేయులు వ్యవహరించనున్నారు.

4 నుంచి పౌరసరఫరా హమాలీల ఆందోళన


గోడౌన్ వద్ద నిరసన తెలుపుతున్న హమాలీలు

పెనుకొండ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : పౌరసరఫరా హమాలీలకు పెరిగిన కూలీ రేట్లకు అనుగుణంగా 14నెలల అరియర్స్ చెల్లింపునకు వెంటనే జీవో విడుదల చేయాలని లేనిపక్షంలో మార్చి 4నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీఐటీయు హమాలీసంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పౌరసరఫరా ల గోడౌన్‌వద్ద సీఐటీయు ఆధ్వర్యంలో హమాలీలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గత నవంబర్ 20న కూలీధరలు రూ.25నుంచి రూ. 28కి పెంచాలని ప్రభుత్వానికి కార్మికుల మధ్య ఒప్పందం కుదిరిందన్నారు. కానీ నేటికీ జీఓ జారీచేయకుండా ప్రభుత్వం కాలయాపన చేయడంపై హమాలీలు నిరసన వ్యక్తం చేశారు. ఈఎస్ఐ అమలుకు ఆటంకంగా ఉన్నా కోర్టు కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో మార్చి4న రాష్ట్ర వ్యాప్తంగా మండల కార్యాలయాలవద్ద ధర్నాలు, 7న విజయవాడ ఎండీ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామన్నారు.

వైద్యాధికారికి వీడ్కోలు

సోమందేపల్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి):సోమందేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న హరికుమార్‌కు ఆసుపత్రి సిబ్బంది శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఉన్నత చదువులకోసం వెళ్తున్న ఆయన్ను సిబ్బంది దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు ఓంకార్, అశ్వినికుమార్, పాల్గొన్నారు.

హిందూపురం ఎమ్మెల్యే పీఏగా వీరయ్య



హిందూపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : స్థానిక శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత సహాయకులుగా వీరయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. విజయవాడలో ట్రెజరీ అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న వీరయ్యను హిందూపురం ఎమ్మెల్యే పీఏగా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. గత తెలుగుదేశం హయాంలో కూడా ఆయన వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేశారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జనసేన నాయకులు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెనుకొండ రోడ్డునందు శుక్రవారం జనసేన పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. నియోజకవర్గం సమన్వయ కర్త రంగస్వామి నాయకులు వెంకటేష్‌గుప్త, మంజు, నాగరాజు, సురేంద్ర, మహేష్, తదితరుల ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం ప్రారంభించారు. ఎన్‌డీఏ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంతోపాటు రాబోయే కాలంలో పార్టీ పటిష్టత కోసం గ్రామస్థాయి నుండి అందరం సమిష్టిగా కలిసి కృషి చేసేందుకు కార్యాలయం ప్రారంభించినట్లు తెలిపారు.

కోనేరు స్థల ఆక్రమణను అడ్డుకోండి

సోమందేపల్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గుడిపల్లి గ్రామం సజ్జకంట రంగనాథస్వామి దేవాలయానికి చెందిన కోనేరు స్థలాన్ని కొంతమంది ఆక్రమిస్తున్నారని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందించారు. సర్వేనంబరు 27లోని 83సెంట్ల భూమిలో కోనేరు ఉందన్నారు. అయితే చుట్టుపక్కల ప్రజలు ఆ భూమిని కబ్జాచేసి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సర్వేయర్‌తో కొలిపించి హద్దులు చూపించాలన్నారు. ఆక్రమణదారులనుంచి కోనేరు స్థలాన్ని కాపాడాలని కోరారు. అనంతరం వీఆర్ఓ నాగరాజుకు వినతిపత్రాన్ని అందించగా ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు ఆయన ఫోన్‌ద్వారా విషయాన్ని వివరించారు. ఆక్రమణలను అరికడతామని ఆయన పేర్కొన్నారు. సర్వేయర్‌ను సంఘటనా స్థలాన్ని పంపించి భూములు కొలతవేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు.

పీ4 సర్వేకు సర్వర్ సమస్య


సీ కోడిగేపల్లిలో పీఫోరు సర్వేచేస్తున్న అధికారులు

మడకశిర రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా, నిరుపేదల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం పీఫోరు సర్వే తలపెట్టింది. ఈ నెల 20 నుంచిగ్రామాల్లో అధికారులు ఇంటింటికి వెళ్ళి సర్వే చేస్తున్నారు. మార్చి 2 న తుది గడువుగా నిర్ణయించారు. అయితే గ్రామాల్లో సర్వర్ సమస్య, పర్యవేక్షణ లోపంతో సర్వే మందకొడిగా సాగుతోంది. కొన్ని గ్రామాల్లో వేగవంతంగా, మరికొన్ని గ్రామాల్లోమందకోడిగా సాగుతోంది. మండలంలో 18 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. సచివాలయ సిబ్బంది గ్రామాల్లో ఇళ్లకు వెళ్ళి కుటుంబ ఆదాయం, ఖర్చులు, డిగ్రీ ఆపై చదివిన వారి వివరాలతో పాటు, వంట గ్యాస్, విద్యుత్తువినియోగం, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి అందుతున్న పథకాల వివరాలతో సమాచారం సేకరిస్తున్నారు.

అగ్ని గుండ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్సీ

అమరాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో శ్రీసిద్దేశ్వరస్వామి అగ్ని గుండ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారి భక్తులు ఉపవాస దీక్షతో హేమావతి చేరుకొని తాము సాగుచేసిన వివిధ రకాల పంటలకు ఎలాంటి చీడపీడలు సోకకుండా సమృద్ధిగా పంటలు పండి అధిక దిగుబడులు రావాలని కోరుకున్నారు. రైతులు తమ పంట పొలాల్లో పండించిన కాయలు, గింజలు, విత్తనాలు తదితర వాటిని అగ్ని గుండంలో పోసి తమ మొక్కుబడులు తీర్చుకొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీయాగం



లేపాక్షి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : లేపాక్షి దుర్గా, వీరభద్ర స్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శుక్రవారం వేద పండితులు శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తాదులతో వేద పండితులు గర్భగుడి ప్రదక్షిణల అనంతరం చండీ హోమాన్ని నిర్వహించారు.

కోడిపందెంరాయుళ్ల అరెస్టు

రొళ్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలం దాసప్ప పాళ్యం కొండ వద్ద కోళ్ల పందాలు నిర్వహిస్తున్న 13మందిని అదుపులోకి తీసుకొని వారి నుండి రెండుకోళ్లను, రూ.8వేల నగదును స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్‌ఐ వీరాంజనేయులు తెలిపారు. వారిని అరెస్టు చేసి కేసునమోదు చేసినట్లు తెలిపారు.

కొండకు నిప్పు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని త్రిపుర రిసార్ట్ వద్ద ఉన్న కొండకు శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. కొండకు నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. చుట్టుపక్కలవారు అప్రమత్తమై ఫైర్ అధికారులకు సమాచారం అందించడంతో ఫైర్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ఆర్పివేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గుడిబండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరహట్టి గ్రామానికి చెందిన నాగేంద్ర నుంచి 115 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌రావు తెలిపారు. కర్ణాటక ప్రాంతం కోటికొత్తూరు నుండి మద్యాన్ని ద్విచక్ర వాహనంలో తీసుకొస్తున్న సమయంలో జంబులబండ క్రాస్ వద్ద సోదాచేసి మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొన్నామన్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి నాగేంద్రను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. ఈదాడుల్లో సిబ్బంది రమణారావు, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

లేపాక్షి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : కల్లూరు గ్రామానికి చెందిన లేట్ చంద్రాయుడు, రత్నమ్మ దంపతుల కుమారుడు సందీప్ (25) విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కల్లూరు గ్రామానికి చెందిన సందీప్ బెంగళూరుకు వలస వెళ్లి చిన్న చిన్న పనులు చేసుకుంటూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. కల్లూరు గ్రామంలో సొంతింటిని నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఇంటికి క్యూరింగ్ కోసం మోటారుతో నీటిని వదిలాడు. ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై కిందపడ్డాడు. వెంటనే హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. తల్లి రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో ఢీకొని ...


మృతి చెందిన జగదీష్

అమరాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):అమరాపురం మండల పరిధిలోని వి.అగ్రహారం గ్రామానికి చెందిన జగదీష్ తన కుమారుడితో కలిసి హేమావతికి జాతర నిమిత్తం ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఉదుగూరు గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొని కిందపడ్డాడు. ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కావడంతో అమరాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా డాక్టర్లు అతడిని పరీక్షించి అప్పటికే అతడు చనిపోయాడని తెలిపారు. అతని కుమారుడు మంజునాథ్‌కు రక్తగాయాలు కావడంతో తుమకూరు ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య పుష్పమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ రామాంజనేయులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

సోమందేపల్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని చాకర్లపల్లి-రంగేపల్లి మధ్యలో ఉన్న రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. చాకర్లపల్లికి చెందిన గొర్రెల కాపర్లు శవాన్ని గుర్తించి గ్రామస్థులకు సమాచారం అందించడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన సాయంత్రం చోటుచేసుకుని ఉంటుందని భావిస్తున్నారు. దీనిపై రైల్వే పోలీసులకు అడగ్గా ఆలస్యంగా సమాచారం అందిందన్నారు. వివరాలు తెలియాల్సి ఉంది.

న్యూస్ బాక్స్

రక్షణ లేని చిత్రావతి వంతెన


చిత్రావతి నదిపై రక్షణగోడ లేని వంతెన

చిలమత్తూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): అసలే తగ్గులో ఉన్న వంతెన...ఆపై రెండు వైపులా ఎత్తు ప్రదేశం...అటు నుంచి కానీ....ఇటు నుంచి కానీ వేగంగా వచ్చే వాహనాలు ప్రమాదవశాత్తు అదుపుతప్పితే మాత్రం ప్రాణాలు గాలిలో కలిసి పోవాల్సిందే. అంత ప్రమాదకరంగా మారింది కొడికొండ వద్ద ఉన్న చిత్రావతి నది వంతెన. గత రెండేళ్లుగా వర్షాలు బాగా కురవడంతో నదీ ప్రవాహం ఊహించిన దాని కంటే ఎక్కువగా వచ్చింది. దాంతో రెండు దఫాలుగా వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. అయితే ఇటీవల ఈ నది వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలకు అనుకూలంగా మార్చారు. అయితే ఈ వంతెనపై రెండు పక్కల రక్షణ గోడలు లేకపోవడంతో వేగంగా వచ్చే వాహనాలు ఏ మాత్రం ఏమరుపాటుకి గురైనా నదిలో పడిపోతాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని అధికారులు ఈ నది వంతెనకు రెండు వైపులా రక్షణగోడ ఏర్పాటుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి టీకాలు

పరిగి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి):మండలంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు నేటి నుంచి 30వ తేదీ వరకు నెలరోజులపాటు టీకాలు వేయనున్నట్లు ఏడీ సోమనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. పశువైద్యాధికారులు, సిబ్బంది రెండు బృందాలుగా ప్రతిగ్రామంలోని పశువులకు ఉచితంగా టీకాలు వేస్తారన్నారు. అన్నిగ్రామాల పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వక్తృత్వ పోటీల్లో ప్రతిభ


అవార్డు అందుకుంటున్న విద్యార్థిని హేమలత

అగళి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : జాతీయ సైన్స్‌డే సందర్భంగా జరిగిన వక్తృత్వ పోటీలలో అగళి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థిని హేమలత జిల్లాస్థాయిలో రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆ బాలిక జిల్లా డీఈఓ కృష్ణప్ప చేతులమీదుగా అవార్డు అందుకుంది. ఇందుకు సహకరించిన నాగేంద్రకుమార్, హిందీ పండిట్ షబ్బీర్‌లకు, ప్రధానోపాధ్యాయుడు వరదరాజులు అభినందనలు తెలిపారు. జిల్లాస్థాయిలో హేమలత రెండో స్థానంలో ఎంపికకావడంతో ఎంఈఓలు భాస్కర్, చంద్రశేఖర్‌నాయుడులు హర్షం వ్యక్తం చేశారు.

సీవీ రామన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

మడకశిర రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):వైజ్ఞానిక శాస్త్ర పితామహుడు సీ వీ రామన్ ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని రేకులకుంట ఉన్నత పాఠశాల, జిల్లేడకుంట ప్రాథమికోన్నత హెచ్ ఎంలు గిరిజ, భూతన్నలు పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పాఠశాలలో శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. మొదట సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం వారు రామన్ చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులు చేసిన సైన్స్ ప్రయోగాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

మడకశిర రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మణూరు పంచాయితీ ఉప్పిడిపల్లి గ్రామంలో బోరువేయించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో తాగునీటి ఎద్దడితో బాధపడుతున్న విషయాన్ని ఆ గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారు. దీనిపై స్పందించిన ఆయన వారం తిరుగక ముందే ఆ గ్రామంలో బోరువేయించారు పుష్కలంగా నీరు పడడంతో మహిళలు గంగపూజ చేశారు. ఎమ్మెల్యే ఇచ్చిన మాటను నిలుపుకున్నారని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

పెనుకొండ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ నగర పంచాయతీ కార్మికులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు పోస్ట్‌కార్డుల ద్వారా వినతులు పంపారు. సీఐటీయు నాయకులు బాబావలి, రమేష్ ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్మికులు శుక్రవారం స్థానిక పోస్ట్ ఆఫీస్ నుంచి తమ సమస్యలను పోస్ట్‌కార్డులపై రాసి ముఖ్యమంత్రికి పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తుందని భావించామన్నారు. ప్రభుత్వం ఆప్కాస్‌రద్దుచేసి కాంట్రాక్టర్లకు అప్పగిస్తే సకాలంలో జీతాలు రాక ఉద్యోగ భద్రత కోల్పోవాల్సి వస్తుందన్నారు. కావున ఆప్కాస్ రద్దుచేయకుండానే కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ముఖ్యమంత్రికి పోస్ట్‌కార్డులు పంపామన్నారు.